


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శనివారం | 08.11.2025 | సంపుటి : 2 | సంచిక :274 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Saturday | 08.11.2025 | volume : 2 | Issue : 274 | Pages : 8 | Cost : 2/- |



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


# హైదరాబాద్ అభివృద్ధికి బ్యాడ్ బ్రదర్స్ అడ్డంకి

## ఉమ్మడి ఎపిలో కాంగ్రెస్ హయాంలోనే నగరాభివృద్ధి



- హైదరాబాద్‌ను డ్రగ్స్‌కు అడ్డాగా చేసిన కెటిఆర్
- నగరంలో 44 చెరువులను కబ్జా చేసిన బిఆర్ఎస్ నేతలు
- మూసీ పునరుద్ధరణ, మెట్రో పొగింపులకు కిషన్ రెడ్డి అడ్డు
- జూబ్లీహిల్స్‌లో బిజెపికి డిపాజిట్ కూడా రాదు
- ఎన్నిక ఏదైనా తానే రంగంలో ఉన్నట్లుగా భావిస్తా
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి

02

రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పడే హైదరాబాద్ ఎక్కువగా అభివృద్ధి చెందిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి ఎపిలో 2004-2014 మధ్య కాలంలోనే రాష్ట్రంలో అభివృద్ధి అన్నది కనిపించిందన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓఆర్ఆర్, శంషాబాద్ విమానాశ్రయం, మెట్రో రైలు.. ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకువచ్చిందన్నారు. 2014 నుంచి కేంద్రంలోని భాజపా, రాష్ట్రంలోని భారత రాష్ట్ర సమితి.. రాష్టానికి చేసింది శూన్యం.

### ప్రైవేట్ విద్యాసంస్థల తాట తీస్తా

విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటారా

బంద్ పెట్టి బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తానంటే ఎలా

- విద్యార్థుల అకడమిక్ ఇయర్ లాస్‌కు ఎవరు బాధ్యులు
- ఫీజులు ఇష్టానుసారం పెంచి రీయింబర్స్‌మెంట్‌పై ఒత్తిడి
- రాజకీయ పార్టీల ఉచ్చులో పడి బెదిరిస్తే ఊరుకునేది లేదు
- ప్రైవేట్ విద్యాసంస్థల తీరుపై సిఎం రేవంత్ ఘాటు హెచ్చరికలు

02



## త్వరలో భారత్‌లో పర్యటిస్తా

- ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి, నా మిత్రుడు
- వాణిజ్య సంబంధాలను పటిష్టం చేస్తా
- డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌లో పర్యటనకు సిద్ధమవుతున్నారు. వచ్చే ఏడాదిలో ఆయన పర్యటన ఉండే అవకాశం ఉంది. ఈ విషయంపై స్వయంగా హింట్ ఇచ్చిన ట్రంప్.. ప్రధాని మోదీ పై ప్రశంసల వర్షం కురిపించారు. భారత్- అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో ట్రంప్ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. బరువు తగ్గించే మందుల ధరలను తగ్గించడానికి సంబంధించి కొత్త ఒప్పందాన్ని ట్రంప్ ప్రకటించారు. ఈ సందర్భంగా వైట్‌హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీతో వాణిజ్య చర్చలు చాలా బాగా జరుగుతున్నాయని తెలిపారు. 'మోదీ రష్యా నుంచి చమురు కొనడం చాలావరకు మానేశారు. ఆయన నాకు గొప్ప స్నేహితుడు. మా మధ్య చర్చలు జరుగుతున్నాయి. నేను అక్కడికి రావాలని ఆయన కోరుకుంటున్నారు. మేము దాన్ని పరిశీలిస్తున్నాం. నేను వెళ్తాను. ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి' అని ట్రంప్ అన్నారు.

06




## మత ఆత్మవిశ్వాసమే వందేమాతరం

### అది భవిష్యత్‌కు సరికొత్త భరోసా

### వందేమాతరం 150వ స్మారకోత్సవంలో ప్రధాని మోదీ

వందేమాతరం శబ్దం విన్నంతనే మనలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుందని ప్రధాని మోదీ అన్నారు. భవిష్యత్తుకు సరికొత్త భరోసా ఇస్తుందన్నారు. శుక్రవారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో వందేమాతరం 150వ స్మారకోత్సవంలో పాల్గొన్న ప్రధాని మోదీ మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్ల మంది భారతీయుల్లో స్ఫూర్తి నింపిన వందేమాతరం గేయానికి శుక్రవారంతో 150 ఏళ్లు పూర్తయ్యాయి.

హైదరాబాద్,నవంబరు7 : ఈ సందర్భంగా ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ గేయాన్ని నవంబరు 7, 1875న బంకించంద్ర ఛటర్జీ రచించారు. ఈ గేయం.. తొలిసారి ఛటర్జీ రాసిన 'ఆనంద్ మఠ్' నవలలో ప్రచురితమైంది. వందేమాతరం గేయం

-మిగతా 2 లో..

## బకాయిలు చెల్లించకుంటే చదువెలా సాగిస్తారు

### ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తేసే కుట్ర

### రేవంత్ వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం

కేంద్రమంత్రి బండి సంజయ్ వెల్లడి



ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తేసే కుట్రలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారని, కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు అడిగితే.. ప్రైవేట్ కాలేజీ యజమాన్యాలని సీఎం రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ చేస్తారా..? అని ఫైర్ అయ్యారంటే అరథం చేసుకోవచ్చన్నారు. అసెంబ్లీ సాక్షిగా ప్రతినెలా బకాయిలు చెల్లిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి మాట ఇచ్చింది నిజం కాదా..? అని ప్రశ్నించారు.

-మిగతా 2 లో..



07

### టెస్లా సీఈవోకు ట్రిలియన్ డాలర్ల వేతన ప్యాకేజీ

తొలి ట్రిలియనీర్‌గా మస్క్

చరిత్ర సృష్టించే అవకాశం



06

### మినిట్‌మ్యాన్-3 క్షిపణి ప్రయోగం

శక్తిమంతమైన క్షిపణిని పరీక్షించిన అమెరికా

## ఫీజు రియింబర్స్‌మెంట్‌పై కుదిరిన సయోధ్య

- నేటినుంచి తెరుచుకోనున్న కాలేజీలు
- భట్టితో సమాఖ్య ప్రతినిధుల చర్చలు
- వెంటనే బంద్ విరమిస్తున్నట్లు ప్రకటన



తెలంగాణ రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశంపై నెలకొన్న సంక్షోభానికి తెరపడింది. ఉపముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్కతో ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల యాజమాన్యాలు శుక్రవారం జరిపిన చర్చలు విజయవంతమయ్యాయి. ప్రభుత్వ హామీతో సంతృప్తి చెందిన యాజమాన్యాలు తమ సమ్మెను విరమించుకునేందుకు అంగీకరించాయి.

హైదరాబాద్, నవంబర్ 7 : దీంతో వేలాది మంది విద్యార్థులకు ఊరట లభించింది. అంగీకారం కుదరడంతో రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ విద్యా సంస్థలు శనివారం తిరిగి తెరుచుకోనున్నాయి. శుక్రవారం సాయంత్రం కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సమావేశమై, తమకు

-మిగతా 2 లో..

## ఓటర్లను బెదిరిస్తున్నారు

- సిఎం రేవంత్‌వి బ్లాక్ మెయిల్ రాజకీయాలు
- ఓట్లు వేయకుంటే రేషన్ కార్డులు ఇవ్వమనడం దారుణం
- మండిపడ్డ మాజీమంత్రి హరీష్ రావు



హైదరాబాద్, నవంబరు 7 : బ్లాక్ మెయిల్ చేసి జూబ్లీహిల్స్‌లో ఓట్లు వేయించుకోవాలని సిఎం రేవంత్ చూస్తున్నారని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేయకుంటే.. రేషన్ కార్డులు ఆగిపోతాయంటున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి అయ్య జాగీరా? రేవంత్ ఇంట్లో నుంచి ఇస్తున్నారా అంటూ ఫైర్

-మిగతా 2 లో..



## వీరు ఆదర్శ ఆటగాళ్లు ఎలా అవుతారు?

### సురేశ్ రైనా, శిఖర్ ధావన్‌లపై కమిషనర్ ఆగ్రహం

హైదరాబాద్, నవంబరు 7 : ప్రజాభిమానాన్ని వ్యాపారంగా మలచుకోవడం దారుణమని క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్‌ధావన్‌పై హైదరాబాద్ పోలీసు కమిషనర్ సజ్జనార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బెట్టింగ్ యాప్‌లకు బ్రాండ్

-మిగతా 2 లో..

## జూబ్లీహిల్స్ గెలుపుపై ఎవరి ధీమా వారిదే

### సర్వేలపైనా పలు పార్టీల నజర్



హైదరాబాద్, నవంబర్ 7 : గ్రేటర్ హైదరాబాదులోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి మరో వారం రోజుల్లో ఉప ఎన్నిక జరుగుతోంది. ప్రస్తుతం బరిలో ఉన్న అన్ని ప్రధాన పార్టీల్లోనూ గెలుపుపై తీవ్రమైన సస్పెన్స్ కొనసాగుతోంది. ఎవరికి వారు గెలుపు గుర్రంపై ధీమా వ్యక్తం చేస్తున్నా అంతర్గత చర్చల్లో మాత్రం ప్రత్యర్థుల ఎత్తులపై చర్చలు వేస్తున్నారు. వారి కంటే మనం బాగా ప్రచారం చేస్తున్నామా ఎక్కడెక్కడ ? ముందు ఉన్నాం ఏ ఏ అంశాల్లో వెనుకబడి ఉన్నాం అనేదానిపై రకరకాల సర్వేలు చేస్తున్నారు.




## వందేమాతరంతో ఆత్మవిశ్వాసం

ఒక స్వప్నం, ఒక సంకల్పం, ఒక మంత్రం అని ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. అది దేశమాత ఆరాధన, సాధన అని పేర్కొన్నారు. ఈ గేయం మనందరినీ పురాణ ఇతిహాసాల్లోకి తీసుకెళ్తుందని చెప్పారు. ఈ సామూహిక గేయాలాపన అద్భుత అనుభవం. ఒకే లయ, స్వరం, భావంతో గేయాలాపన హృదయాన్ని స్పందింపజేస్తుందని ప్రధాని అన్నారు. వందేమాతరం 150 ఏళ్ల స్మారకోత్సవాలు నిర్వహించుకుంటున్నామని, ఇవి దేశ ప్రజలకు ప్రేరణనిస్తాయని మోదీ అన్నారు. వందేమాతరం స్మారక స్టాంపు, నాణెం విడుదల చేశాం. ప్రతి గీతానికి ఒక మూలభావం, సందేశం ఉంటుంది. మన వందేమాతరం మూలభావం భారత్, మా భారతి అని పేర్కొన్నారు. ఇది దేశానికి ఒక ప్రార్థన లాంటిదన్నారు. ఇది మనల్ని చరిత్రలోకి తీసుకెళుతుంది. ఇది మన భవిష్యత్తుకు ధైర్యాన్ని ఇస్తుంది. భారతీయులు సాధించలేని సంకల్పం లేదు. సాధించలేని లక్ష్యం లేదని మోదీ పేర్కొన్నారు. నవంబర్ 7 అనేది ఒక చారిత్రాత్మక రోజు అని.. వందేమాతరం ఆవిర్భవించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఘనంగా వేడుకలు జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం కోట్లాది మంది భారతీయుల్లో కొత్త శక్తిని ఉత్పత్తి చేస్తుందని చెప్పారు. వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా ప్రతి పౌరుడికి శుభాకాంక్షలు తెలిపారు. ఇక 1950లో భారతదేశం గణతంత్ర దేశంగా ఆవిర్భవించిన సందర్భంగా ఈ వందేమాతరం గేయాన్ని జాతీయ గేయంగా గుర్తించారు. ఇదిలా ఉంటే కేంద్ర ప్రభుత్వం ఈ 2025 సంవత్సరాన్ని 150 ఏళ్ల 'వందే మాతరం'గా పరిగణించింది. ఈ రోజు నుంచి వచ్చే ఏడాది 2026, నవంబర్ 7 వరకు దేశవ్యాప్తంగా వందేమాతరం జాతీయ గేయం సంస్మరణోత్సవాలను జరపాలని నిర్ణయించింది.

# హైదరాబాద్ అభివృద్ధికి బ్యాడ్ బ్రదర్స్ అడ్డంకి

- ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ హయాంలోనే నగరాభివృద్ధి
- హైదరాబాద్‌ను డ్రగ్స్‌కు అడ్డాగా చేసిన కెటిఆర్
- నగరంలో 44 చెరువులను కబ్జా చేసిన బిఆర్ఎస్ నేతలు
- మూసీ పునరుద్ధరణ, మెట్రో పొడిగింపుకు కిషన్ రెడ్డి అడ్డు
- జూబ్లీహిల్స్‌లో బిజెపికి డిపాజిట్ కూడా రాదు
- ఎన్నిక ఏదైనా తానే రంగంలో ఉన్నట్లుగా భావిస్తా
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, నవంబరు 7 :** రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే హైదరాబాద్ ఎక్కువగా అభివృద్ధి చెందిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి ఏపిలో 2004-2014 మధ్య కాలంలోనే రాష్ట్రంలో అభివృద్ధి అన్నది కనిపించిందన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓఆర్ఆర్, శంషాబాద్ విమానాశ్రయం, మెట్రో రైలు.. ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకువచ్చిందన్నారు. 2014 నుంచి కేంద్రంలోని భాజపా, రాష్ట్రంలోని భారత రాష్ట్ర సమితి.. రాష్ట్రానికి చేసింది శూన్యం. హైదరాబాద్‌లో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. 2014లో రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. 2023లో కేసీఆర్ తెలంగాణను రూ.8లక్షల కోట్ల అప్పుల్లో పెట్టి మళ్లీ కాంగ్రెస్‌కు అప్పగించారు. హైదరాబాద్‌కు యూపీఏ ప్రభుత్వం ఇచ్చిన ఐటీఐఆర్‌ను రద్దు చేసింది ఎవరని అన్నారు. ఐటీఐఆర్ కూడా మంజూరు చేసి ఉంటే రాష్ట్రం మరింత అభివృద్ధి చెంది ఉండేదని అన్నారు. వరదలు వచ్చి హైదరాబాద్ మునిగిపోతే కేంద్రం చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కేంద్రం నుంచి వరద సాయంగా రూపాయి కూడా తేలేదని అన్నారు. హైదరాబాద్‌లో 44 చెరువులను భారత రాష్ట్ర సమితి నేతలు కబ్జా చేశారు. అంబర్‌పేటలో బతుకమ్మకుంటను ఆ పార్టీ అంబర్‌పేట ఇన్‌ఛార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి ఆక్రమించారు. చెరువుల్ని కబ్జాలను తొలగించి పునరుద్ధరిస్తే.. దానిపై రాజకీయం చేస్తున్నారు. అహ్మదాబాద్‌లో సబర్మతి ప్రక్షాళన చేసుకున్నారు.. యూపీలో నది ప్రక్షాళన చేశారు. అహ్మదాబాద్‌లో కొత్త నగరం కట్టుకున్నారు.. తెలంగాణలో అడ్డుకుంటున్నారు. గతంలో కాంగ్రెస్ వల్లే నగరం అభివృద్ధి చెందింది. ఇప్పుడు కాంగ్రెస్‌ను గెలిపిస్తే అభివృద్ధి పనులు జరుగుతాయి. అభివృద్ధి పనుల వల్ల పేదలకు నష్టం జరిగితే ఆదుకుంటాం. ఇళ్లు కోల్పోయిన పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తాం. ప్రజలను ఓటు అడుగుతున్నా.. మీ ఓటు ద్వారా హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకుందాం అని సీఎం విజ్ఞప్తి చేశారు. భారత రాష్ట్ర సమితి హయాంలో కాళేశ్వరం, కమాండ్ కంట్రోల్ సెంటర్, సచివాలయం, ప్రగతి భవన్ నిర్మించారు. కుమారుడిని ముఖ్యమంత్రిని చేయాలని, వాస్తు సరిగా లేదని బాగున్న సచివాలయాన్ని కూలగొట్టి.. కొత్తది నిర్మించారు. పేద ప్రజలకు ఆ సచివాలయం వల్ల ఏమైనా ఉపయోగం ఉందా? కొత్త ఉద్యోగాలు ఏమైనా వచ్చాయా? అంటూ ప్రశ్నించారు. ప్రతిపక్షాలు, మీడియా ప్రతినిధులపై నిఘా పెట్టేందుకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఎవరికీ అనుమతి లేని విలాసవంతమైన భవనాలు మాత్రమే నిర్మించారు. రైతు కోసమని కట్టిన కాళేశ్వరం మాత్రం మూడేళ్లకే కూలింది. పదేళ్లలో మెట్రో రైలును కొత్తగా కిలోమీటరు కూడా పొడిగించలేదు. మంజూరైన పాతబస్తీ మెట్రోను కూడా పక్కన పెట్టారు. మెట్రో నిర్మించిన ఎల్ అండ్‌టీ నష్టాలకు కూడా భారత రాష్ట్ర సమితే కారణం అని సిఎం అన్నారు. 2047 నాటికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు కావస్తోంది. భవిష్యత్ ప్రణాళికలు ఎలా ఉండాలో విజన్ డాక్యుమెంట్ తయారు చేస్తున్నాం. మెట్రో విస్తరణకు రూ.43వేల కోట్లతో ప్రణాళికలు కేంద్రానికి ఇచ్చాం. ఆనాడు హైదరాబాద్ అభివృద్ధి కోసం కొట్లాడిన శశిధర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డిని హైదరాబాద్ బ్రదర్స్ అనే వాళ్లు. నేడు హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్న కిషన్‌రెడ్డి, కేటీఆర్‌ను బ్యాడ్ బ్రదర్స్ అంటున్నారు. వీరిద్దరూ కలిసి మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన, రీజినల్ రింగ్ రోడ్డు, ఫ్యూచర్‌సిటీని అడ్డుకుంటున్నారు. గోదావరి జలాలు 20 టీఎంసీలు హైదరాబాద్ నగరానికి తేవాలని ప్రయత్నిస్తుంటే అడ్డుకుంటున్నారు. హైదరాబాద్‌లో నిర్మించాలనుకున్న ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లకు అడ్డంకులు సృష్టిస్తున్నారు. 30 ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న కంటోన్మెంట్ నుంచి శామీర్‌పేట, మేడ్చల్‌కు ఎలివేటెడ్ కారిడార్లకు అప్రూవల్ తెచ్చి రూ.5వేల కోట్లతో పనులు ప్రారంభించాం. ఉత్తర తెలంగాణ మొత్తం ఈ రెండు ఎలివేటెడ్ కారిడార్లపైనే ఆధారపడి ఉంది. పదేళ్ల అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి.. వాటి అనుమతులకు ప్రయత్నం చేయలేదని అన్నారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణానికి అనుమతులు తీసుకొచ్చాం. అదనంగా కొత్తగూడెం, రామగుండం ఎయిర్‌పోర్టులకు ప్రయత్నాలు చేస్తున్నాం అని రేవంత్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి 6 నెలలు పార్లమెంట్ ఎన్నికలతో గడిచిపోయాయి. ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో పనిచేసింది ఏడాదిన్నర మాత్రమే. ఏడాదిన్నరలోనే రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చాం. రూ.లక్ష కోట్ల ఆదాయం వచ్చే ఓఆర్ఆర్‌ను కేవలం రూ.7వేల కోట్లకు భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం అమ్ముకుంది. దీపావళి రోజు కూడా ఇళ్లలో డ్రగ్స్‌తో పట్టుబడిన వారిని ఏమనాలన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీకి డిపాజిట్ రాదని...రాసిపెట్టుకోవాలని సీఎం రేవంత్ అన్నారు. బీజేపీ ఓడితే..హిందువులంతా బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నారని ఒప్పుకుంటారా.. బండి సంజయ్ దీనిని రెఫరెండంగా భావిస్తారా అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ లో బీజేపీ గెలవాలని కిషన్ రెడ్డికే లేదన్నారు. బీఆర్ఎస్ ను ఓడించండి..బీజేపీ డిపాజిట్ గల్లంతు చేయాలని పిలుపునిచ్చారు రేవంత్. ఏ ఎన్నికనైనా తాను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటానన్నారు రేవంత్.. పార్టీ అభ్యర్థి ఉన్న చోట తాను పోటీలో ఉన్నట్లే ఫీలవుతా... కేసీఆర్ లా ఫామ్ హౌస్ లో పడుకోవాలా? అని ప్రశ్నించారు. ప్రతీ ఎన్నిక తమ ప్రభుత్వ పనితీరుకు పరీక్షనన్నారు. అండగా ఉంటే పదేళ్లలో అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తానన్నారు. సర్వేల గురించి తాను మాట్లాడనన్నారు రేవంత్..డబ్బులిచ్చి సర్వేలు చేయించుకుంటున్నారని ఆరోపించారు. కిషన్ రెడ్డి..కేసీఆర్,కేటీఆర్ లకు లొంగిపోయారని విమర్శించారు. హైదరాబాద్ లో చెప్పుకోదగ్గ ప్రాజెక్టులు ఏమైనా ఉన్నాయంటే..అవి కాంగ్రెస్ తెచ్చినవేనన్నారు. హైదరాబాద్ ప్రజలు 2004 నుంచి 2014, 2014 నుంచి 2024 వరకు జరిగిన అభివృద్ధిని పోల్చి చూడాలన్నారు.కేసీఆర్ హైదరాబాద్ కు తెచ్చిన గొప్ప వరాలు..గంజాయి..డ్రగ్స్ అని విమర్శించారు. కేటీఆర్ హైదరాబాద్ ను డ్రగ్స్ కు అడ్డాగా మార్చారని ధ్వజమెత్తారు. బీజేపీ,బీఆర్ఎస్ కలిసి హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. భవిష్యత్ కోసం జూబ్లీహిల్స్ ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటెయ్యాలని పిలుపునిచ్చారు.

## సిఎం రేవంత్‌వి బ్లాక్ మెయిల్ రాజకీయాలు

(మొదటిపేజీ తరువాయి)

అయ్యారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిలర్ అంటూ కామెంట్స్ చేశారు. చెప్పుకోవడానికి ఏమీ లేకనే.. జూబ్లీహిల్స్‌లో రేవంత్ బ్లాక్ మెయిల్ చేస్తున్నారని అన్నారు. ఓటమి భయంతో రేవంత్ రెడ్డి వ్యక్తిగత కామెంట్స్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్లాక్ మెయిలర్‌కు జూబ్లీహిల్స్ ప్రజలు బుద్ధి చెప్పాలని ఆయన కోరారు.కంటోన్మెంట్‌లో ఆరు వేల డబుల్ బెడ్రూం ఇళ్ళు ఎక్కడ అని ప్రశ్నించారు. ప్రజలను మభ్యపెట్టి కంటోన్మెంట్‌లో గెలిచారన్నారు. రెండేళ్ళుగా అజహారుద్దీన్‌కు మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. బీఆర్ఎస్ ఒత్తిడితోనే ముస్లింలకు మంత్రి పదవి.. ఎన్టీఆర్, పీజేఆర్ విగ్రహాల హామీలు అంటూ వ్యాఖ్యలు చేశారు. సినీ యాక్టర్స్‌ను జైల్లో పెట్టిన రేవంత్.. సినీ కార్మికులకు ఒంగి ఒంగి దండాలు పెడుతున్నారంటూ ఎద్దేవా చేశారు. 2023లో పీజేఆర్ కొడుకుకు ఎందుకు టికెట్ ఇవ్వలేదని అడిగారు. కాంగ్రెస్ అరాచకం, మంత్రి పదవి ఇవ్వకపోవటంతోనే పీజేఆర్ చనిపోయారంటూ సంచలన కామెంట్స్ చేశారు. జూబ్లీహిల్స్ ప్రజల తీర్పుతో రాష్ట్ర భవిష్యత్‌కు దశ దిశ ఏర్పడుతుందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ఏ ఒక్క వర్గం కూడా సంతృప్తిగా లేదని అన్నారు. నాలుగు కోట్ల ప్రజలు కాదు.. నలుగురు బ్రదర్స్ మాత్రమే హ్యాపీగా ఉన్నారంటూ కామెంట్స్ చేశారు. గ్యారంటీలు ఎగ్గొట్టిన అరాచక ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అంటూ విరుచుకుపడ్డారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలిస్తే.. మూడేళ్ళ పాటు నరకయాతన అనుభవించాల్సి ఉంటుందని తెలిపారు. వికాసానికి.. విధ్వంసానికి మధ్య జరుగుతున్న ఎన్నికల్లో ఏది కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. రేవంత్ అంటేనే బ్లాక్ మెయిలర్ అంటూ వ్యాఖ్యలు చేశారు. సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించి పారిశ్రామికవేత్తలను బెదిరించిన చరిత్ర రేవంత్ ది అని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అడుగుతోన్న కళాశాలను రేవంత్ బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్ ప్రారంభించిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను కేసీఆర్ కొనసాగించారని గుర్తుచేశారు. హైడ్రా విషయంలో డిప్యూటీ సీఎం భట్టి, సీఎం బ్లాక్ మెయిల్ చేస్తున్నారంటూ హరీష్ రావు మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు మర్రి జనార్ధన్ రెడ్డి, రవీందర్ రావు ఇంటిపై దాడులను మాజీ మంత్రి ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులను బెదిరిస్తోందన్నారు. కాంగ్రెస్ అరాచకాలపై 20 ఫిర్యాదులు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. హోంమంత్రిగా, విద్యామంత్రిగా, మున్సిపల్ మంత్రిగా.. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అట్టర్ ఎ÷-లాప్ అంటూ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రిపై రోజుకో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉత్తరాలు రాస్తున్నారని.. సొంత ప్రభుత్వంపై ముఖ్యమంత్రికి పట్టు లేదంటూ విమర్శలు గుప్పించారు. రేవంత్ హయాంలో క్రైం రేటు పెరిగిందన్నారు. కమీషన్ల కోసం కమాండ్ కంట్రోలు సెంటర్‌లో సీఎం సమీక్షలు చేస్తున్నారని మాజీమంత్రి ఆరోపించారు. బీజేపీ నుంచి 8 మంది ఎంపీలు గెలిచినా తెలంగాణకు తెచ్చింది గుండు సున్నా అంటూ వ్యాఖ్యలు చేశారు. నవీన్ యాదవ్ తమ్ముడు వెంకట్ యాదవ్‌కు మూడు ఓట్లు ఉన్నాయన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటే అని ఆరోపించారు. ప్రధాని చెప్పిన ఆర్ఆర్ టాక్స్‌పై ఎందుకు చర్యలు లేవని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలు కలిసి బీసీలను మోసం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ఎప్పుడు వచ్చింది? ముస్లింలు ఎప్పుడు నుంచి ఉన్నారు అని నిలదీశారు. కాంగ్రెస్ లేకుంటే.. ముస్లింలు లేరన్న రేవంత్ రెడ్డి కామెంట్స్ అన్యాయమన్నారు. ముస్లింలను రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని మండిపడ్డారు. ముస్లింలకు రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు.

## ఎస్సీ గురుకుల సొసైటీలో సెలవుల రద్దు

**హైదరాబాద్, నవంబరు 7 :** ఎస్సీ గురుకుల సొసైటీ కేంద్ర కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు అన్నిరకాల సెలవులు రద్దు చేస్తూ సొసైటీ కార్యదర్శి కృష్ణ ఆదిత్య నిర్ణయం తీసుకున్నారు. పొరుగుసేవలు, ఒప్పంద ఉద్యోగుల వేతనాల సమస్య పరిష్కరించే వరకు సెలవులు తీసుకోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఆర్థికశాఖ ఆదేశాల మేరకు సంక్షేమ గురుకులాలు ఆయా సొసైటీల్లో పనిచేస్తున్న ఒప్పంద, పొరుగుసేవలు, గౌరవ వేతన ఉద్యోగుల ఆధార్ అనుసంధాన ప్రక్రియ మొదలుపెట్టాయి. ఎస్సీ సొసైటీలో మాత్రం ప్రక్రియ పూర్తికాకపోవడంతో ఆయా ఉద్యోగులకు 2నెలలుగా వేతనాలు అందట్లేదు. మరోవైపు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల్లో విద్యార్థులకు నీట్, ఐఐటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు నియమించిన 160 మంది సబ్జెక్టు నిపుణులు, అసోసియేట్లకు సైతం నాలుగు నెలలుగా జీతాలు రావట్లేదు. ఈ నేపథ్యంలోనే సెక్షన్ డిప్యూటీ సెక్రటరీ, సహాయ సెక్రటరీ, సూపరింటెండెంట్లు, ఉద్యోగులంతా కలిసి వేగంగా అనుసంధాన ప్రక్రియను పూర్తిచేయాలని కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు.

## ప్రైవేట్ విద్యాసంస్థల తాట తీస్తా

(మొదటిపేజీ తరువాయి)

కాలేజీలను బంద్ చేయించిన వారితో చర్చలు ఎలా ఉంటాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఫీజురీయంబర్స్‌మెంట్‌పై ప్రైవేటు విద్యాసంస్థలు ఇటీవల బంద్‌కు పిలుపునిచ్చాయి. ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశాయి. లేకపోతే నిరవధిక ఆందోళన చేపడతామని హెచ్చరించాయి. తెలంగాణ ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో విద్యాసంస్థలను కొనసాగించడం చాలా కష్టంతో కూడుకున్నదని ప్రైవేటు విద్యాసంస్థలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలోనే ప్రైవేటు విద్యాసంస్థలపై సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్ అయినట్లు తెలుస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ తెలంగాణలో ఉన్నత విద్యాసంస్థలు చేపట్టిన బంద్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. విడతల వారీగా బకాయిలు చెల్లిస్తామన్నారు. మా హయాంలోని బకాయిలు ముందు చెల్లిస్తాం గతంలో ఉన్న బకాయిలపై చర్చిస్తామని అన్నారు.అయితే బందులతో విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడొద్దన్నారు. ఇలా చేయడం విద్యార్థులపై ప్రభావం చూపదా అని అన్నారు. బకాయిలు ఇవాళ కాకపోతే రేపు వసూలవుతాయి. కాలేజీలు బంద్ పెడితే విద్యార్థులు కోల్పోయిన సమయం తిరిగి వస్తుందా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులకు ఇబ్బంది లేదు. అన్ని వర్గాలను సమన్వయం చేసుకుంటూ వెళ్లాలి. రాష్ట్రానికి నెలకు రూ.18వేల కోట్ల ఆదాయం వస్తోంది. జీతాలు, వడ్డీలు, ఇతర ఖర్చులు పోనూ మిగిలేది రూ.5 వేల కోట్లే. ఈ ఆదాయంతో రాష్ట్రాన్ని ఎలా నడపాలో చెప్పండి. ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేస్తున్నారా? కాలేజీలను బంద్ చేయించినవారితో చర్చించేదేముంది? ఏ కాలేజీ ఎంత డొనేషన్ వసూలు చేస్తుందో నాకు తెలుసు. కాలేజీలో నిబంధనలు పాటించకపోతే ఎలా? ఇష్టానుసారం ఫీజులు పెంచుకుంటూ పోతే ఎలా? విద్య వ్యాపారం కాదు.. విద్యను సేవగా భావించాలి. రాజకీయ నేతలు అండగా ఉన్నారని విద్యార్థులతో ఆడుకోవద్దు. అడ్డగోలుగా ఫీజులు పెంచుకుని వచ్చి రీయింబర్స్‌మెంట్ అడుగుతున్నారు. కాలేజీలకు అనుమతుల విషయంలో ఎన్నో అక్రమాలు ఉన్నాయి. కాలేజీల యజమానులు ప్రభుత్వాన్నే బ్లాక్ మెయిల్ చేస్తారా? బీసీ నేత ఆర్.కృష్ణయ్య కూడా అమాయకంగా వాళ్ల ఉచ్చులో పడ్డారు. ఆర్.కృష్ణయ్య, మందకృష్ణ ముందుకొస్తే వాళ్ల చేతికే చిట్టా ఇస్తా. నాలుగు నెలలు ప్రభుత్వాన్ని మీరే నడపండని సీఎం అన్నారు.



## నేటి నుంచి తెరుచుకోనున్న కాలేజీలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ రూపంలో సుమారు రూ. 1500 కోట్ల బకాయిలు రావాల్సి ఉందని ప్రస్తావించారు. వారి విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్న భట్టి విక్రమార్క, ప్రభుత్వం తరపున కీలక హామీలతో సమస్యను సత్వరం పరిష్కరించారు. తమ ప్రభుత్వం ఇప్పటికే రూ. 600 కోట్లు విడుదల చేసిందని తెలియజేశారు. అంతేకాకుండా, తక్షణమే మరో రూ. 600 కోట్లు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. మిగిలిన రూ. 300 కోట్లను కూడా త్వరలోనే విడుదల చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ విధంగా, యాజమాన్యాలు కోరిన పూర్తి బకాయిలను చెల్లించ డానికి ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. ఈ క ÷-రమంలో ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో చర్చల అనంతరం బంద్ విరమిస్తున్నట్టు ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్, ఫార్మసీ తదితర వృత్తి విద్యా కళాశాలలతో పాటు డిగ్రీ, పీజీ కళాశాలలను ఈనెల 3వ తేదీ నుంచి బంద్ కారణంగా మూతబడ్డాయి. ప్రభుత్వంతో కాలేజీల యాజమాన్యాలు జరిపిన చర్చలు సఫలం కావడంతో కళాశాలలు యథావిధిగా తెరుచుకోనున్నాయి. ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ఛైర్మన్ రమేష్ బాబు, పలువురు ఉన్నతాధికారులు చర్చల్లో పాల్గొన్నారు. బకాయిల చెల్లింపుతో ప్రస్తుత సమస్య పరిష్కారమైనప్పటికీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల విషయంలో భవిష్యత్తులో ఇలాంటి ఆటంకాలు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికను సిద్ధం చేస్తోంది. దీనిలో భాగంగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానంపై సమగ్రంగా అధ్యయనం చేసి, సకాలంలో పారదర్శకంగా చెల్లింపులు జరిగేలా కొత్త మార్గదర్శకాలను సూచించడానికి త్వరలోనే ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా ప్రభుత్వం శాశ్వత పరిష్కారాన్ని అమలు చేయనుంది.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తేసే కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

బకాయిలు చెల్లిస్తామని టోకెన్లు ఇచ్చి మోసం చేసింది నిజం కాదా? అని నిలదీశారు. బకాయిలు చెల్లించకుండా కాలేజీలను మోసం చేస్తోంది నిజం కాదా? అని అన్నారు. శుక్రవారం బీజేపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో బండి సంజయ్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతే... మరి టోకెన్లు ఎందుకు ఇచ్చినట్లు అని ప్రశ్నించారు. రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా ఎందుకు హామీ ఇచ్చారని నిలదీశారు. చట్టసభలో ఇచ్చిన హామీకే విలువ లేకుంటే ఇక అసెంబ్లీకి విలువ ఏముందని అడిగారు. సార్వత్రిక ఎన్నికలకు ముందే తెలంగాణ రూ.7 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని రేవంత్‌రెడ్డే చెప్పారు కదా అని గుర్తుచేశారు. ఇప్పుడు అందుకు భిన్నంగా మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోతే కాలేజీలు ఎలా నడవాలని నిలదీశారు బండి సంజయ్. అధ్యాపకులకు జీతాలివ్వకపోతే విద్యార్థులకు చదవు చెప్పేదెవరు..? అని అడిగారు. కాలేజీ యాజమాన్యాలపై సీఎంకు ఉన్న కోపంతో.. విద్యార్థుల జీవితాలను బలి చేయాలనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని ఆరోపించారు. చట్టం పేరుతో బెదిరింపులకు పాల్పడితే పాలన నడవదనే విషయాన్ని సీఎం గుర్తుంచుకోవాలని హితవు పలికారు. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించి చట్టం గురించి మాట్లాడితే మంచిదని సూచించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కొనసాగిస్తారా? ఎత్తి వేస్తారా? ప్రజలకు స్పష్టం చేయాలని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించేదాకా.. విద్యార్థులు, అధ్యాపకులు, కాలేజీ యాజమాన్యాల ఆందోళనకు బీజేపీ మద్దతు కొనసాగుతుందని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు.

## రేవంత్‌కు దమ్ముంటే 24 నెలల పాలన చూపించి ఓట్లు అడగాలి

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, నవంబరు 7 :** రేవంత్‌రెడ్డికి దమ్ముంటే 24 నెలల తన పాలన చూపించి ఓట్లు అడగాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పదేళ్ల కేసీఆర్ పరిపాలన.. రెండేళ్ల దుర్మార్గ పాలన మీ కళ్ల ముందే ఉందని, ప్రజలు చూసి తీర్పు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. భారత రాష్ట్ర సమితి అభ్యర్థి మాగంటి సునీత తరఫున జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని వెంగళరావునగర్ డివిజన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన రోడ్‌షోలో కేటీఆర్ మాట్లాడారు. ఏటీఎంలు, బ్యాంకుల ముందు అటెన్షన్ డైవర్షన్ చేసి సొత్తు దోచుకెళ్లే మాదిరి.. ఇప్పుడు భాజపా రంగంలోకి దిగిందని విమర్శించారు. చిల్లర పంచాయితీలు పెట్టి రేవంత్‌రెడ్డికి లాభం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎవరు ఎన్ని ప్రచారాలు, గిమ్మిక్కులు చేసినా గెలుపు మాగంటి సునీత, కేసీఆర్‌లదేనని స్పష్టం చేశారు. అన్ని వర్గాలను 24 నెలలుగా మోసం చేస్తున్న కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేయాలని కేటీఆర్ ప్రశ్నించారు. భారత రాష్ట్ర సమితి హయాంలో హైదరాబాద్‌లో 36 ఫ్లైఓవర్లు కడితే.. రేవంత్ సర్కారు 36 గుంతలు కూడా పూడ్చలేదని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఒకసారి మోసం చేశారని.. మళ్లా మళ్లా మోసపోతే తప్పు మనది అవుతుందన్నారు. పాతిక సంవత్సరాల్లో ఆరుగురు ముఖ్యమంత్రులు మారితే ఐదుగురు హైదరాబాద్ అభివృద్ధికి ఎంతో చేశారని కేటీఆర్ అన్నారు. 'హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు గట్టిగా ప్రయత్నం చేశారు. రాజశేఖరరెడ్డి అభివృద్ధితోపాటు సంక్షేమం జోడించారు. రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి శక్తివంచన లేకుండా ప్రయత్నం చేశారు. పదేళ్లు కేసీఆర్ పరిపాలించారు. పక్కాగా 14 నాడు ఇక్కడ ఎగిరేది గులాబీ జెండా అనే విషయం సీఎంకు కూడా అర్థమైందని పేర్కొన్నారు.

## వీరు ఆదర్శ ఆటగాళ్లు ఎలా అవుతారు?

(మొదటిపేజీ తరువాయి)

అంబాసిడర్లుగా ఉంటూ వీరు ఎలాంటి సందేశం ఇవ్వాలనుకున్నారని మండిపడ్డారు. ప్రేక్షకుల అభిమానాన్ని సొమ్ము చేసుకునే వీళ్లు ఆదర్శ ఆటగాళ్లు ఎలా అవుతారని ప్రశ్నించారు. బెట్టింగ్ మహమ్మారికి ఎందరో యువకులు బలవుతున్నారు. వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. వేల మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. సమాజాన్ని ఛిద్రం చేస్తోన్న బెట్టింగ్ భూతాన్ని ప్రచారం చేసిన వీరు వీటన్నింటికీ బాధ్యులు కారా అని అన్నారు. సమాజ మేలు కోసం, యువత ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి నాలుగు మంచి మాటలు చెప్పండి. అంతే కానీ మిమ్మల్ని అభిమానించే వాళ్లను తప్పుదోవ పట్టించి.. వారి ప్రాణాలను తీయకండి అని ఎక్స్‌లో సజ్జనార్ పోస్టు పెట్టారు.

## ఉన్నత విద్యాసంస్థల వినతిపై

# వారంలోగా నిర్ణయం తీసుకోండి

### హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్, నవంబర్ 7 :** ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థలు దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ ముగించింది. దరఖాస్తును పరిశీలించి వారంలో నిర్ణయం తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం పోరాటంలో భాగంగా హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో 'సాంత్వన సభ' నిర్వహించేందుకు ఉన్నతా విద్యాసంస్థల సమాఖ్య దరఖాస్తు చేసుకుంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఉన్నందున సాంత్వన సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య హైకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలు చేసింది. పోలీసుల నుంచి వివరాలు తీసుకోవాల్సి ఉందని హెూంశాఖ జీపీ మహేశ్.. విచారణ సందర్భంగా కోర్టుకు తెలిపారు. బండ్లగూడలోని అరోరా కళాశాలలో సభ పెట్టుకుంటామని సమాఖ్య తరఫు న్యాయవాది తెలిపారు. ఎక్కడ సభ పెట్టుకోవాలన్నా పోలీసుల అనుమతి తప్పనిసరి అని హెూంశాఖ జీపీ స్పష్టం చేశారు. ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం.. వారంలో పోలీసులు నిర్ణయం తీసుకోవాలని ఆదేశిస్తూ పిటిషన్‌పై విచారణ ముగించింది. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఈనెల 8న నిర్వహించ తలపెట్టిన సాంత్వన సభ వాయిదా వేసినట్టు ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య ప్రకటించింది. హైకోర్టు సూచనల మేరకు ఈనెల 14 వరకు సభను వాయిదా వేస్తున్నట్టు తెలిపింది.



## దొంగచాటు అణు కార్యక్రమం

# పాక్‌కు అలవాటే

### ట్రంప్ వ్యాఖ్యలకు విదేశాంగశాఖ స్పందన



**న్యూఢిల్లీ, నవంబరు 7 :** రహస్యంగా, చట్టవిరుద్ధంగా అణు కార్యకలాపాలు కొనసాగించడంలో పాకిస్థాన్‌కు దశాబ్దాల చరిత్ర ఉందని భారత విదేశాంగశాఖ స్పష్టం చేసింది. స్మగ్లింగ్, ఎగుమతి నియంత్రణ ఉల్లంఘనలు, రహస్య భాగస్వామ్యాలు దశాబ్దాలుగా పాకిస్థాన్‌కు అలవాటేనని తెలిపింది. ఏకే ఖాన్ నెట్‌వర్క్ విస్తరణ చుట్టూ ఇది కేంద్రీకృతమైందని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు. ప్రపంచంలో అణ్వాయుధాలను పరీక్షిస్తున్న దేశాల్లో పాకిస్థాన్ కూడా ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై భారత్ స్పందించింది. ఆ వ్యాఖ్యలను నిశితంగా పరిశీలిస్తున్నామని తెలిపింది. ఈ అంశాలను అంతర్జాతీయ సమాజం దృష్టికి భారత్ ఎల్లప్పుడూ తీసుకెళ్తూనే ఉంటుందని జైశ్వాల్ అన్నారు. వచ్చే ఏడాది భారత్‌లో పర్యటిస్తానని ట్రంప్ చేసిన ప్రకటన గురించి అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. దీనిపై ప్రస్తుతానికి తమకు ఎటువంటి సమాచారం లేదన్నారు. ప్రపంచంలో చాలా దేశాలు చురుగ్గా అణ్వాయుధాలను పరీక్షిస్తున్నాయని, ఆ జాబితాలో పాకిస్థాన్ ఉందని అమెరికా అధ్యక్షుడు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. రష్యా, చైనా, ఉత్తరకొరియా, పాకిస్థాన్ వంటి దేశాలు అణు పరీక్షలను నిర్వహిస్తున్నాయని, వాళ్లనెవ్వరూ ప్రశ్నించరని అన్నారు. తాము మాత్రం బహిరంగంగానే చెబుతామన్నారు. ఇన్నాళ్లూ ఎన్ని దేశాలు అణు పరీక్షలు చేపట్టినా వాటి జోలికి వెళ్లలేదని.. ఇకపై అలా మిగిలిపోవాల నుకోవట్లేదన్నారు. ఇతర దేశాల మాదిరిగానే తామూ అణు పరీక్షలు నిర్వహిస్తామని ట్రంప్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

## డయాబెటిస్, ఒబెసిటీ ఉంటే..

# అమెరికా వీసా తిరస్కరణ

- తాజాగా ప్రతిపాదనలు తెస్తున్న అమెరికా
- అంతర్జాతీయ మీడియా కథనాలు




**వాషింగ్టన్, నవంబర్ 7 :** అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వలసదారులపై,వారికిచ్చే వీసాలపై కఠిన నిబంధనలు అమలు చేస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో నిబంధనను తీసుకొచ్చారు. డయాబెటిస్, ఒబెసిటీ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి వీసాలను తిరస్కరించాలనే కొత్త నిబంధనలను రూపొందించారు. ఈ మేరకు అమెరికా ఎంబసీలు, కాన్సులర్ కార్యాలయాలకు అగ్రరాజ్య విదేశాంగ శాఖ తాజాగా మార్గదర్శకాలు జారీ చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. సాధారణంగా అమెరికా వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారి ఆరోగ్య స్థితిని ఇమిగ్రేషన్ అధికారులు పరిశీలిస్తారు. టీబీ వంటి అంటు వ్యాధులు ఉన్నాయో లేదో స్క్రీనింగ్ చేస్తారు. ఈ నిబంధనలను తాజాగా సవరించారు. మరిన్ని వ్యాధులను ఈ జాబితాలో చేరుస్తూ మార్గదర్శకాలు రూపొందించారు. అంటే.. ఇకపై వీసా కోసం దరఖాస్తు చేసుకున్న వలసదారుల మెడికల్ హిస్టరీపై అధికారులు మరింత దృష్టి సారించనున్నారు. వారు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతుంటే తిరస్కరించాలన ఇనిర్ణయించారు. హృద్రోగ సమస్యలు, శ్వాస సంబంధిత వ్యాధులు, క్యాన్సర్, డయాబెటిస్, జీవక్రియ, నాడీ సంబంధిత వ్యాధులు, మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడేవారిని సంరక్షించాలంటే లక్షల డాలర్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇక, ఒబెసిటీ కారణంగా ఆస్తమా, స్లీప్ అప్నియా, హై బీపీ వంటి సమస్యలు ఎదురవుతాయి. ఇలాంటి వ్యాధిగ్రస్తులకు సుదీర్ఘ వైద్య సంరక్షణ అవసరం. ఆర్థిక భారం కూడా ఎక్కువే. అందుకే వలసదారుల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసి వారు ప్రభుత్వ వనరులపై ఆధారపడుతారో లేదో గుర్తించాలి. ఒకవేళ అలాంటి వారైతే అమెరికాలోకి ప్రవేశాన్ని తిరస్కరించాలని ఆ మార్గదర్శకాల్లో వెల్లడించారు.అయితే, ఈ వార్తలపై అమెరికా విదేశాంగ శాఖ స్పందించలేదు. దీంతో ఈ రూల్స్ అమల్లోకి వచ్చాయా లేదా అన్న దానిపై స్పష్టత లేదు.

## సైబర్ క్రైమ్ పోలీసుల భారీ ఆపరేషన్



**హైదరాబాద్, నవంబర్ 7 :** సైబర్ నేరగాళ్ల ఆగడాలను అరికట్టేందుకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. అక్టోబర్ నెలలో 196 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి.. 55 మందిని అరెస్టు చేశారు. బాధితులకు రూ.62.34 లక్షలు అప్పగించారు. సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాల్లో రూ.107 కోట్ల లావాదేవీలు గుర్తించారు. వివిధ కేసుల్లో 8 రాష్ట్రాలకు చెందిన 55 మంది సైబర్ మోసగాళ్లను అరెస్టు చేసినట్లు శుక్రవారం పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. చైనా పౌరుల ద్వారా డిజిటల్ అరెస్టు స్కామ్ చేస్తున్నట్లు గుర్తించారు. 62 ఏళ్ల వృద్ధుడి నుంచి రూ.1.07 కోట్లు దోచుకున్న ముఠాను సైబర్ క్రైమ్ పోలీసులు గత నెలలో అరెస్టు చేశారు. అదృశ్యమైన ఫోన్ ద్వారా ముగ్గురు నిందితులు రూ.1.95 లక్షలు దోచుకోగా వారిని కూడా అరెస్టు చేశారు. ఏపీలో ఫేక్ ట్రేడింగ్ యాప్‌తో రూ.24.17 లక్షలు మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేశారు. ఇన్వెస్ట్‌మెంట్, డిజిటల్ అరెస్టు, సోషల్ మీడియా ఫ్రాడ్‌ల ద్వారా 33 సైబర్ మోసాలు జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల నుంచి 31 సెల్‌ఫోన్లు, 14 చెక్‌బుక్‌లు, 9 డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు.



## పోచారంలో పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా

**మేడ్చల్, నవంబర్ 7 :** కబ్జారాయుళ్ల నుంచి పార్క్ స్థలాన్ని హైడ్రా స్వాధీనం చేసుకుంది. మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధి చౌదరిగూడలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానిక శ్రీనివాస కాలనీలో 400 గజాల పార్కు స్థలాన్ని కబ్జాదారుల నుంచి హైడ్రా అధికారులు రక్షించారు. లే అవుట్ చేసిన సమయంలో ఈ స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. దాన్ని అభివృద్ధి చేయకపోవడంతో కొందరు తప్పుడు పత్రాలతో కబ్జా చేశారు. కాలనీవాసులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా వారి నుంచి స్పందన రాలేదు. దీంతో హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేపట్టారు. కబ్జాకు గురయినట్లు తేలడంతో శుక్రవారం అధికారులు పార్కులో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి, చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేశారు. హైడ్రా చర్యల పట్ల కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ఉద్యోగాల కోసం సైబర్ ఉచ్చులో నిరుద్యోగులు

### వారిని కాపాడి స్వదేశానికి రప్పించిన కేంద్రం

**న్యూఢిల్లీ, నవంబర్ 7 :** ఉద్యోగాల పేరిట మోసపోయి, మయన్మార్, థాయ్‌లాండ్ సరిహద్దులో సైబర్ నేర కేంద్రంలో చిక్కుకున్న పలువురు బాధితులు దిల్లీ చేరుకున్నారు. కేంద్రప్రభుత్వం తీసుకున్న చొరవతో వీరు బంధవిముక్తులు అయ్యారు. ఉద్యోగాల పేరుతో మోసపోయి వీరు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కున్నారు. ఇందులో ఏపీకి చెందిన 11 మంది, తెలంగాణకు చెందిన మరో 11 మంది ఏపీ, తెలంగాణ భవన్‌లకు చేరుకున్నారు. అక్కడి అధికారులు నేటి మధ్యాహ్నం లోగా బాధితులను స్వస్థలాలకు చేర్చనున్నారు. సైబర్ నేరాల్లో చిక్కుకున్న పలువురు భారతీయులను ప్రత్యేక వైమానిక దళ విమానంలో విదేశాంగశాఖ అధికారులు దిల్లీకి తీసుకొచ్చారు. ఐటీబీపీ కేంద్రంలో అన్ని రకాల పత్రాలను పరిశీలించి, సంబంధిత రాష్ట్రాల యంత్రాంగంతో సంప్రదించిన తర్వాత తెలుగు రాష్ట్రాల అధికారులకు అప్పగించారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలను చూసి మోసపోయి, నకిలీ ఉద్యోగాల మోజులో పడకుండా జాగ్రత్తపడాలని సూచించారు. స్వదేశంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

## జూబ్లీహిల్స్‌లో అధికార దుర్వినియోగం

### కేంద్ర ఎన్నికల సంఘానికి బిఆర్ఎస్ ఫిర్యాదు

**న్యూఢిల్లీ, నవంబరు 7 :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు ఆయన కేబినెట్ సహచరులు కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ ఎంపీ కె.ఆర్.సురేష్ రెడ్డి విమర్శించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ.. అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. అధికార పార్టీకి అనుకూలంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని.. ఈ నేపథ్యంలో కేంద్ర బలగాల ఆధ్వర్యంలో ఈ ఉపఎన్నికను నిర్వహించాలని ఈసీని కోరినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం ఉన్నతాధికారులతో బీఆర్ఎస్ ఎంపీలు కె.ఆర్.సురేష్ రెడ్డి, దామోదర్ రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈ ఉప ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు వ్యవహరిస్తున్న తీరును వారికి వివరించి.. ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకర్లతో ఎంపీ కె.ఆర్.సురేష్ రెడ్డి మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారని.. దాంతో అక్కడ మహిళా అధికారులను నియమించాలని సీఈసీని కోరినట్లు తెలిపారు. అలా కాకుంటే దొంగ ఓట్లు వేసే అవకాశం ఉందని ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత మాగంటి గోపినాథ్ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అనివార్యమైంది. నవంబర్ 11వ తేదీన ఈ ఉప ఎన్నిక జరగనుంది. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు.. తమ తమ అభ్యర్థులను రంగంలోకి దింపాయి. ఈ ఉప ఎన్నికల్లో గెలుపు కోసం ఆయా పార్టీలు పక్కా వ్యూహాత్మకంగా ముందుకు వెళున్నాయి. ఆ క్రమంలో అధికార పార్టీ హామీల వర్షం కురిపిస్తోంది. ఇక ప్రతిపక్షలు బీఆర్ఎస్, బీజేపీలు.. అధికార పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయలేదంటూ విమర్శలు గుప్పిస్తున్నాయి. దీంతో ఈ మూడు పార్టీలు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నాయి. అయితే అధికార కాంగ్రెస్ పార్టీ ఈ ఉపఎన్నికల్లో గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అందుకోసం మంత్రులు, అగ్రనేతలను ఈ నియోజకవర్గంలోని డివిజన్లకు ఇన్‌ఛార్జ్‌లుగా నియమించి.. గెలుపు కోసం కృషి చేయాలని పార్టీ అధిష్ఠానం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.



## బిఆర్ఎస్ నేతల ఇళ్లలో సోదాలు

### ఎన్నికల సమయంలో కామన్ అన్న మంత్రి పొన్నం

**హైదరాబాద్, నవంబర్ 7 :** హైదరాబాద్‌లో భారత రాష్ట్ర సమితి నేతల ఇళ్లలో ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ సోదాలు చేపట్టింది. ఈ అంశంపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. ఎన్నికల సమయంలో సోదాలు సహజమని.. ఎవరి ఇంట్లో అయినా అధికారులు తనిఖీలు చేస్తారని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం పరిధిలో ఫ్లయింగ్ స్క్వాడ్ పనిచేస్తుందని తెలిపారు. ఎవరిపైనైనా ఫిర్యాదులు వస్తే సోదాలు చేయడం ఎన్నికల సంఘం హక్కు అని తెలిపారు. ప్రతిదాన్ని రాజకీయం చేయడం గులాబీ పార్టీ నేతలకు అలవాటైందని విమర్శించారు. ఇక జూబ్లీహిల్స్‌లో 10 వేల ఓట్లు కూడా భాజపాకు రావని పొన్నం ఎద్దేవా చేశారు. కిషన్‌రెడ్డి నియోజకవర్గంలోనే ఆ పార్టీని ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ ఎన్నికల్లో భాజపా-భారత రాష్ట్ర సమితి లోపాయికారి ఒప్పందం చేసుకున్నాయని ధ్వజమెత్తారు.

## హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్..

# వెబ్‌సైట్ ప్రారంభం

**హైదరాబాద్, నవంబర్ 7 :** హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ వెబ్‌సైట్ https://hisff.in/ వినియోగంలోకి వచ్చింది. సదరు వెబ్‌సైట్‌ను ఎఫ్‌డీసీ ఎండీ ప్రియాంక, ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత సంయుక్తంగా శుక్రవారం ప్రారంభించారు. ఆసక్తి ఉన్నవారు.. 3 సెకన్ల నుంచి 25 నిమిషాల పాటు నిడివి గల లఘు చిత్రాలను పంపాలని కోరారు. ఆయా వీడియోలను ఈ వెబ్‌సైట్‌లో మాత్రమే అప్‌లోడ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఐమాక్స్ వేదికగా నిర్వహించనున్న వేడుకకు అంతర్జాతీయ ఆర్టిస్టులు, సాంకేతిక నిపుణుల హాజరవుతారని తెలిపారు. ముగింపు వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. వచ్చే ఏడాది నవంబరు 14 నాటికి అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాన్ని నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ జరగనుంది. దాదాసాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టడీ సంస్థ ద్వారా డిసెంబర్ 19 నుంచి 21 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రూ.30 లక్షలు విడుదల చేసినట్లు పేర్కొన్నారు.



## బస్సు ప్రమాద బాధితులకు

# కోటి పరిహారం ఇవ్వాలి

### బాధితులకు కవిత పరామర్శ

**రంగారెడ్డి,నవంబర్7 :** చేవెళ్ల బస్సు ప్రమాద సంఘటనలో మరణించిన 19 మందికి ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నవంబర్ 7న వికారాబాద్ జిల్లా యాలాల మండలము ప్యార్కంపల్లి గ్రామంలో ఇటీవల మరణించిన ముగ్గురు అక్కచెల్లెళ్ల కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ చేవెళ్ల బస్సు ప్రమాదం జరగడానికి ప్రధాన కారణం రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. ప్రమాదం జరిగిన తర్వాత రోడ్లు మరమ్మత్తులు చేయడమేంటని ప్రశ్నించారు. ముందే ఈ రోడ్డు మరమ్మత్తు చేపట్టితే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని, 19 మంది కుటుంబాలు రోడ్డున పడేవి కావన్నారు బాధితులను పట్టించుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తాను వారికి అండగా నిలుస్తానని చెప్పారు. నవంబర్ 3న చేవెళ్ల సమీపంలోని మీర్జాగూడ దగ్గర టిప్పర్ లారీ బస్సును ఢీ కొట్టడంతో 19 మంది చనిపోయిన సంగతి తెలిసిందే. మృతుల కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం రూ. 5లక్షలు,ఆర్టీసీ నుంచి రూ.2లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం కూడా పీఎంఎన్ఆర్ నుంచి 2 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించిన సంగతి తెలిసిందే.

## కాలిన గాయాలతో చిన్నారి మృతి

**హైదరాబాద్, నవంబర్ 7 :** దీపం అంటుకొని తీవ్ర గాయాలపాలైన ఏడేళ్ల చిన్నారి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ విషాద ఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారం మున్సిపాలిటీ ఆర్.ఎల్. నగర్ లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా, బీబీనగర్ గ్రామానికి చెందిన మధుసూదన్ రెడ్డి కుటుంబ సభ్యులతో నాగారం మున్సిపాలిటీలోని ఆర్.ఎల్. నగర్ లో నివాసముంటున్నారు. బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఇంట్లో దీపాలు వెలిగించారు. అయితే మధుసూదన్ రెడ్డి కుమార్తె సాయి నేహా రెడ్డి(7)కి ఇంట్లో ప్రమాదవశాత్తు దుస్తులకు దీపం అంటుకోవడంతో కేకలు వేసింది. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సైనిక్ పురిలోని ప్రైవేట్ హాస్పిటల్ కి తీసుకెళ్లగా వైద్యుల సూచన మేరకు ఖార్కానాలోని రెయిన్ బో చిల్డ్రన్స్ హాస్పిటల్ కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా 90 శాతం శరీరం కాలిపోవడంతో పరిస్థితి విషమించి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

## కేంద్రమంత్రి బండి సంజయ్‌పై ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు

**హైదరాబాద్, నవంబర్ 7 :** కేంద్రమంత్రి బండి సంజయ్‌పై ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసినందుకుగానూ ఆయనపై చర్యలు తీసుకోవాలని పీసీసీ ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో సీఈవోకు ఫిర్యాదు చేసింది. గురువారం బోరబండలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొంది. "తులం బంగారం ఇచ్చుడు కాదు.. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలిస్తే ఉన్న బంగారం గుంజుకెళ్తారు. సీఎం రేవంత్‌రెడ్డి.. ఒక్క కేసులో కూడా కేసీఆర్ కుటుంబాన్ని జైల్లో పెట్టలేదు. అధికార, ప్రతిపక్ష పార్టీలు కలిసి దోచుకున్న రాష్ట్రం ఏదైనా ఉందంటే అది తెలంగాణ" అని సంజయ్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

## జూబ్లీహిల్స్‌లో మద్యం, డబ్బు స్వాధీనం

**హైదరాబాద్, నవంబర్ 7 :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో భారీగా నగదు, మద్యం పట్టుబడుతోంది. నవంబర్ 7 ఉదయం వరకు రూ. 3.3 కోట్ల నగదు ..701 లీటర్ల మద్యం సీజ్ చేశారు అధికారులు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.4 లక్షల 74 వేల 322. 2 కిలోలకు పైగా గంజాయి . 0.11 గ్రాముల ఓఆఓంతో సహా మాదకద్రవ్యాలను కూడా ఏజెన్సీలు స్వాధీనం చేసుకున్నాయి. వీటి విలువ రూ.లక్షా 97 వేల 600 ఉంటుందని అధికారులు వెల్లడించారు నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనలో భాగంగా 24 కేసులు నమోదయ్యాయి. వీటిలో 15 ఎన్నికల సంబంధిత హింసకు సంబంధించినవి, ఏడు అనుమతి లేకుండా సమావేశాలు , ప్రసంగాలకు సంబంధించినవి. రెండు ఓటర్లను ఆకర్షించే ఉద్దేశ్యంతో నగదు, సరకుల పంపిణీకి సంబంధించినవి. నియోజకవర్గంలో 45 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 45 స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలను ఏర్పాటు చేశారు . ఈ బృందాల వాహనాలకు జీపీఎస్, పీటీజెడ్ కెమెరాలను అమర్చి, జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ నుంచి 24గంటలు పర్యవేక్షిస్తున్నారు. జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి మధ్యే ప్రధాన పోటీ ఉండనుంది. సిట్టింగ్ సీటు దక్కించుకోవాలని బీఆర్ఎస్, జూబ్లీహిల్స్ లో గెలవాలని అధికార పార్టీ, సత్తా చాటాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు పోలింగ్ .. 14న కౌంటింగ్ జరగనుంది. జూబ్లీహిల్స్ లో మొత్తం 4,లక్షల 13వందల 65 ఓటర్లు ఉన్నారు.

# స్వాతంత్ర్యోద్యమంలో ప్రేరణ మంత్రం వందేమాతరం!



ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాల్లో వందేమాతరం తరవాత భారతదేశం నా మాతృభూమి.. అంటూ ప్రతిజ్ఞ చేయించేవారు. వందేమాతరం చదివిన తరవాతనే పాఠశాల తరగతి గదులు ప్రారంభం అయ్యేవి. ఆనాటి నిబద్దత ఇప్పుడు ప్రైవేట్ స్కూళ్లు వచ్చాక కనుమరుగయ్యింది. జగనణమన కూడా మనదేశ ఆత్మగా నిలిచింది. ఈ రెండు గీతాలకు భారతదేశంలో విడదీయరాని సంబంధం ఏర్పడింది. దేశాన్ని ఏకతాటిపై నడిపించిన వందేమాతరం గీతానికి 150 వత్సరాలు. నిత్యనూతనంగా ఇప్పటికీ వందేమాతరం మార్మోగు తోంది. దేశాన్ని కట్టిపడేసే ప్రార్థనాగీతంగా ఇది ఎంతో ప్రాచుర్యం కలిగించింది. స్వాతంత్ర్య ఉద్యమ శ్లోకంగా నిలిచి నేటికీ జాతీయ గీతంగా భాసిల్లుతోంది. వందేమాతర గీతం తరవాతనే దేశవ్యాప్తంగా ఉత్తేజితం మొదలయ్యింది. బ్రిటిష్ వారిని పారదోలేందుకు ఇది ఎంతగానో తోడ్పడింది. ప్రజలను ఏకం చేయడంలో వందేమాతర గీతం నిప్పుకణికలా మండింది. ఎక్కడిక్కడ వందేమాతరం గీతాలాపనతో ప్రజలు ఉద్యమంలో దుమికారు. అందుకే ఆనాటి బ్రిటిష్ పాలకులు వందేమాతర గీతం పాడిన వారిపై దమనకాండకు తెగించారు. 1875లో కార్తిక శుక్ల నవమి, జగద్ధాత్రి పూజనాడు బంకించంద్ర ఛటర్జీ కలం నుంచి జాలువారిన వందేమాతర గీతం...స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణగా నిలిచింది. భారతదేశ పురాతన సాంస్కృతిక మూలాలు ఈ గీతరచనకు ప్రేరణనిచ్చాయి. సర్వ మంగళ మాంగళ్యే శివే... అంటూ సాగే దేవీమాత స్తోత్రం వందేమాతరం గీతానికి ప్రేరణగా భావిస్తారు. అందుకే కొందరు దీనిని పాడడానికి ఇప్పటికీ ఇష్టపడరు. ఇది మనదేశ దౌరభాగ్యంగా చూడాలి. మతం ముసుగులో కొందరు దీనిని తృణీకరించినా అది ప్రజల నరనరాల్లో జీర్ణించుకుపోయిన ఉత్తేజిత గీతంగా నిలిచింది. భారతదేశ చరిత్రలో మహోద్యమాలకు కళలూ పాటలూ అంతరాత్మగా నిలిచిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అంతెందుకు తెలంగాణ ఉద్యమంలో పాటే పరవళ్లు తొక్కపోతే ఉద్యమమే లేదు. జాతి భావోద్వేగాలను వెన్నుతట్టి స్వాతంత్ర్య కాంక్ష అనే సమష్టి కార్యాచరణ కు పురిగొల్పడంలో వందేమాతరం గీతం కీలకభూమిక పోసించింది. అందుకే భారత స్వాతంత్ర్య పోరాటంలో అత్యంత ప్రత్యేకమైనదిగా వందేమాతరం గీతం నిలిచింది. ఈ అమర గీతం వెలువడి 150 సంవత్సరాలైనందున ఏడాదిపాటు దేశమంతటా ఉత్సవాలు నిర్వహించాలని కేంద్రం నిశ్చయించింది. స్వాతంత్ర్య ఉద్యమానికి జవజీవాలు అందించడమే కాదు, సాంస్కృతిక జాతీయవాదానికి బీజం వేసింది. భారతదేశమంటే మట్టి కాదనీ... కర్తవ్యం, అంకితభావాలతో పునీతమైన పుణ్యతీర్థమనీ ప్రబోధించింది. మహర్షి అరవిందుడు వర్ణించినట్లు- బంకించంద్రుడు ఆధునిక భారత రుషి. ఆయన పదాలు జాతి ఆత్మను మళ్లీ మేల్కొలిపాయి. నిదురిస్తున్న జాతి తన ఆత్మబలాన్ని కనుగొ నేలా జాగృతం చేయడంలో వందేమాతరం గీతం ప్రముఖ భూమిక పోషించదనడంలో సందేహం లేదు. బ్రిటిష్ పాలకుల ఇనుప ఉక్కు సంకెళ్ల కింద నలిగిపోతున్న తరుణంలో బంకించంద్ర ఛటర్జీ రచించిన వందేమాతరం జాతికి ప్రభాత గీతమైంది. మన సంస్కృతి, నాగరికతల పట్ల గర్వాభిమానాలను రేకెత్తించే గానమైంది. అణువణువునా మాతృభూమిపై భక్తి, అనురక్తి ఉట్టిపడేలా మేల్కొలిపే రణనినాద గీతమైంది. వందేమాతరం భాషా ప్రాంతీయ భేదాలకు అతీతంగా కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు జాతిని జాగృతం చేసింది. బ్రిటిష్ వలస పాలకులపై ధిక్కార ప్రకటనగా ప్రజలు యావద్దేశంలో వందేమా తరం అంటూ నినదించారు. 1905లో బెంగాల్ విభజనపై నిరసన వెల్లువెత్తినప్పుడు వందేమాతరం అంతటా మార్మోగింది. దాంతో బ్రిటిష్ పాలకులు ఆ పాటను నిషేధిం చారు. కానీ, 1906 ఏప్రిల్ 14న బారిసాల్‌లో వేలమంది ఉద్యమకారులు ఆ నిషేధాన్ని ధిక్కరించి వందేమాతరం అంటూ ఘోషించారు. లాఠీ దెబ్బలకు రక్తమోడుతున్నా లెక్కచేయకుండా స్త్రీపురుషులు అలా ఘోషిస్తూనే ఉన్నారు. 1946లో తిరుగుబాటు చేసిన రాయల్ ఇండియన్ నేవీలోని భారతీయ నావికులు వందేమాతరం అంటూ నినదిస్తూ బ్రిటిష్ యుద్ధనౌకలపై జాతీయ పతాకను ఆవిష్కరించారు. మొద్దునిద్రలో ఉన్నవారినైనా మేల్కొలిపే మంత్రశక్తి వందేమాతరానికి ఉందని మహాత్మాగాంధీ పేర్కొన్నారు. ఇన్నేళ్లయినా వన్నె తగ్గకుండా మనజీవితాల్లో అది పెనవేసుకుపోయింది. భారతజాతిని కలసి ఉంచే గీతంగా నిలిచింది. స్వాతంత్ర్య ఉ ద్యమంలో వెలిగిన ఈగీతాజ్యోతి ఇంకా జ్వాజ్వల్యమా నంగా వెలుగుతోంది. ఇప్పుడు ఏడాది ఉత్సవాల్లో భాగంగా వందేమాతరం పూర్తిరూపంలో ప్రతిధ్వనిస్తూ యువత మనసుల్లో సాంస్కృతిక జాతీయవాదాన్ని నింపుతుందనడంలో సందేహం లేదు. వందేమాతరం కేవలం గత వైభవ స్మరణం కారాదు.

మనజాతిని మేల్కొలిపే ఉజ్జ్వల భవిష్యత్తుకు ప్రేరణగానూ తీసుకోవాలి. భారత ఆత్మను ఆవహించుకునే గీతంగా చూడాలి. ఘనమైన భారతదేశ సంస్కృతీ నాగరికతలపై మనకున్న అభిమానాలకు నిదర్శనమైన ఆ గీతస్ఫూర్తిని ఆచరణలోకి తీసుకురావడం మనందరి బాధ్యత. వందేమాతరం పారతంత్ర భారతదేశానికి తొలి మేల్కొలుపు. మొక్కవోని దీక్షను చాటిన స్వేచ్ఛా గీతమది. భారతదేశపు ఆత్మ నుంచి జనించిన ఈ గీతం అజరామజరంగా నిలుస్తుంది. తరతరాలకు ఉత్తేజమిస్తుంది. భారతీయత అనే కోణం నుంచి మన చరిత్ర, సంస్కృతి, విలువలు, సంప్రదాయాలను వీక్షించి... నిరంతరం స్ఫూర్తి పొంది... సదా కార్యాచరణలో నిమగ్నం కావాలని ప్రబోధించే దివ్య గానంగా వందేమాతరం నిరంతర స్మరణ కావాలి. పాలకులు దీన్ని ప్రేరణగా తీసుకుని భారత పునరుజ్జీవానికి అంకితం కావాలి. కేవలం గీతాలాపనతో సరిపుచ్చక భారత ఉజ్వల భవిష్యత్‌కు ప్రేరణగా తీసుకోవాలి. దేశంముందు వందనం చేయడంతో పాటు, సంకల్ప సిద్ధి కోసం వందేమాతరం గీతాన్ని ఆలపించాలి. దేశీయంగా స్వయం సమృద్ధి సాంధించేందుకు నేటికీ ఇది ప్రేరణ మంత్రంగా నిలవాలని ఆశిద్దాం.

# ఏపీలో క్వాంటమ్ కంప్యూటింగ్

- రూ.1,772 కోట్లతో మైక్రోసాఫ్ట్ ఏర్పాటు!
- 1,200 క్యూబిట్ సామర్థ్యముతో నిర్మాణం
- 50 ఎకరాలు కేటాయించిన సీఆర్డీఎ
- జనవరి నాటికి కార్యకలాపాలకు సిద్ధం!?



**అమరావతి, నవంబర్ 7 :** ప్రముఖ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో క్వాంటమ్ కంప్యూటింగ్ స్థాపనకు శ్రీకారం చుట్టింది. ఏకంగా రూ.1,772.08 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టేందుకు ప్రతిపాదించింది. ఇందులో భాగంగా అమరావతి క్వాంటమ్ వ్యాలీలో 1,200 క్యూబిట్ సామర్థ్యమున్న (50 లాజికల్ క్యూబిట్స్) భారీ క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయనుంది. క్వాంటం వ్యాలీ భవనానికి ఆనుకుని 4 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ప్రత్యేక భవనంలో మైక్రోసాఫ్ట్ ఈ సౌకర్యాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి, ఈ భవనానికి క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ 50 ఎకరాలు కేటాయించింది. ప్రభుత్వ ప్రకటన మేరకు క్వాంటం వ్యాలీ టెక్ పార్క్ జనవరి 1, 2026 నాటికి కార్యకలాపాలకు సిద్ధంగా ఉంటుంది. ఇది దేశీయ, విదేశీ క్లయింట్‌లకు సేవలందించడానికి దశలవారీగా 90,000 చదరపు అడుగుల అంతర్నిర్మిత ప్రాంతంలో సూపర్ కంప్యూటర్‌లను ఉంచనుంది. 133 క్యూబిట్ సామర్థ్యంతో క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటుకు ఇప్పటికే ఐబీఎం సంస్థ ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది.'అమరావతి క్వాంటం వ్యాలీ డిక్లరేషన్'ను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూపొందించింది. ఇది జనవరి 1, 2029 నాటికి ఈ రంగంలో 1 బిలియన్ డాలర్ల పెట్టుబడులను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. క్వాంటం టెక్నాలజీలను అభివృద్ధి చేయడం, సిలికాన్ వ్యాలీ తరహాలో శక్తివంతమైన ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థను సృష్టించడంపై దృష్టి సారించడానికి అమరావతిని దేశంలోని మొట్టమొదటి క్వాంటం వ్యాలీగా మార్చడం ఈ ప్రకటన లక్ష్యం. మరోవైపు క్వాంటమ్ వ్యాలీలో పెట్టుబడులు పెట్టేందుకు మరిన్ని సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. జపాన్‌కు చెందిన ఫుజిసు 64 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇనీషియేటివ్ కింద అందించే నిధులకు మరో 50 శాతం వెచ్చించి ఫ్యాబ్రికేషన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తెచ్చింది. క్వాంటమ్ వ్యాలీలో పరిశోధనలకు దశల వారీగా 90 లక్షల చదరపు అడుగుల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని ప్రభుత్వం యోచిస్తుంది. ప్రస్తుతం నిర్మించనున్న ఐకానిక్ టవర్ వల్ల 40 వేల చదరపు అడుగులు అందుబాటులోకి రానున్నాయి. మరోవైపు దేశంలోనే మొట్టమొదటి ఫుల్ స్టాక్ క్వాంటం వ్యాలీ టెక్ పార్క్‌ను స్థాపించడానికి ప్రభుత్వంతో సహకరించడానికి ఐబీఎం ఇప్పటికే తేసీఎస్, ఎల్ఎన్టీ లతో అవగాహన ఒప్పందం చేసుకున్నాయి. ఇటీవల జరిగిన క్వాంటం వ్యాలీ వర్క్‌షాప్‌లో ఐబీఎం దాని తాజా 156-క్విట్ హెూరాన్ ప్రాసెసర్ మోడల్‌ను కూడా ప్రదర్శించిం ది. వేగంగా అభివృద్ధి చెందుతున్న క్వాంటం సైన్స్, దాని అను వర్తనాలపై అవగాహన కల్పించడానికి ఐక్యరాజ్యసమితి ఇప్పటికే 2025 ను అంతర్జాతీయ క్వాంటం సైన్స్ అండ్ టెక్నాలజీ సంవత్సరంగా ప్రకటించింది. క్వాంటం అనేది గేమ్-ఛేంజింగ్ టెక్నాలజీ. ఇది 2030 నాటికి వేగంగా అభివృద్ధి చెందనున్నట్లు నిపుణులు భావిస్తున్నారు.

# జూబ్లీహిల్స్ గెలుపుపై ఎవరి ధీమా వారిదే

## సర్వేలపైనా పలు పార్టీల నజర్



**హైదరాబాద్, నవంబర్ 7 :** గ్రేటర్ హైదరాబాదులోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి మరో వారం రోజుల్లో ఉప ఎన్నిక జరుగుతోంది. ప్రస్తుతం బరిలో ఉన్న అన్ని ప్రధాన పార్టీల్లోనూ గెలుపుపై తీవ్రమైన సస్పెన్స్ కొనసాగుతోంది. ఎవరికి వారు గెలుపు గుర్రంపై ధీమా వ్యక్తం చేస్తున్నా అంతర్గత చర్చల్లో మాత్రం ప్రత్యర్థుల ఎత్తులపై చర్చలు వేస్తున్నారు. వారి కంటే మనం బాగా ప్రచారం చేస్తున్నామా ఎక్కడెక్కడ ? ముందు ఉన్నాం ఏ ఏ అంశాల్లో వెనుకబడి ఉన్నాం అనేదానిపై రకరకాల సర్వేలు చేస్తున్నారు. ఇప్పటివరకు జరిగిన ప్రచారాన్ని భేరీజు వేసుకుంటున్నారు. ఈ క్రమంలోని బిఆర్ఎస్ - కాంగ్రెస్ వర్గాలు సర్వేలను ఆధారం చేసుకుని గెలుపు తమది అంటూ ప్రచారం చేసుకోవడం ఒక అంశం అయితే .. ఈ ఉప ఎన్నికల్లో గెలుపు ఆధారంగా ఆయా పార్టీలు తమ నాయకులకు పదవులు ఇచ్చే అంశాన్ని కూడా పరిశీలిస్తూ ఉండటం విశేషం. కాంగ్రెస్ పార్టీ నుంచి మంత్రి పదవులు ఆశించిన వారు .. నామినేటెడ్ పదవులు ఆశించిన వారు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో ఆ పార్టీని గెలిపించేందుకు గట్టిగా కష్టపడుతున్నారు. ఇక బిఆర్ఎస్ లోను ఇదే తరహా ప్రచారం జరుగుతోంది. పార్టీ పదవుల కోసం ఆశలు పెట్టుకున్న వారు ... వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఆశిస్తున్న వారు కేసీఆర్ దగ్గర మంచి మార్కుల కోసం .. కేటీఆర్ దగ్గర మంచి మార్కుల కోసం గట్టిగా కష్టపడుతున్నారు. ఉప ఎన్నికల్లో తమ సత్తా చాటాలని ప్రయత్నాలు చేస్తున్నారు. మరి వీరిలో ఎవరి ఆశలు నెరవేరుతాయో చూడాలి.

# వీధి కుక్కల కేసు.. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు



**న్యూఢిల్లీ, నవంబర్ 7 :** వీధి కుక్కల కేసులో శుక్రవారం సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. విద్యాసంస్థలు, బస్, రైల్వేస్టేషన్లు, క్రీడా సముదాయాలు, ఇతర బహిరంగ ప్రదేశాల సమీపం నుంచి వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. అలాగే అవి ఈ ప్రదేశాల లోపలికి వెళ్లకుండా కంచెలు వేయాలని సూచించింది. ఈ ప్రాంగణాల్లో కుక్కలు లేవని నిర్ధరించుకునేందుకు క్రమంతప్పకుండా తనిఖీలు చేయాలని తన ఆదేశాల్లో పేర్కొంది. ఏ కారణం చేతనైనా మళ్లీ వాటిని పట్టుకొన్నచోటే వదిలివేయొద్దని ఆదేశించింది. కుక్కల తరలింపునకు కోర్టు 8 వారాల సమయం ఇచ్చింది. జాతీయ రహదారులపై తిరుగుతున్న ఆలనాపాలనా లేని పశువులను షెల్టర్లకు తరలించాలని సూచించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, జాతీయ రహదారుల శాఖ, స్థానిక సంస్థలు హైవే గస్తీ బృందాలకు ఆదేశాలు ఇచ్చింది. అలాగే తదుపరి విచారణను జనవరి 13కు వాయిదా వేసింది.

# భారీ యుద్ధ నౌకను ప్రారంభించిన చైనా

**చైనా :** నావికా దళంలో అమెరికాతో పోటీ పడేందుకు చైనా తన ఆయుధ సంపత్తిని విస్తరిస్తోంది. అందులోభాగంగా అత్యంత సామర్థ్యం కలిగిన 'ఫుజియాన్' (టైప్-003) యుద్ధ నౌకను తాజాగా ప్రారంభించింది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో చేసిన ఈ విమాన వాహన నౌకను చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ప్రారంభించినట్లు తెలుస్తోంది. బుధవారం హైనాన్ ద్వీపంలోని సైనిక నౌకాశ్రయంలో దీనికి సంబంధించిన వేడుకలు జరిగినట్లు స్థానిక అధికార మీడియా పేర్కొంది. ఈ సందర్భంగా జిన్‌పింగ్ యుద్ధ నౌకను పరిశీలించినట్లు తెలిపింది. ఫుజియాన్ చైనాకు చెందిన మూడో అత్యంత అధునాతన యుద్ధ నౌక. విద్యుదయస్కాంత ఆధారిత వ్యవస్థ అయిన ఎమాల్స్‌ను ఇందులో వినియోగించారు. 316 మీటర్ల పొడవు, 80వేల టన్నుల బరువు ఉన్న ఈ ఫుజియాన్‌కు దాదాపు 50 విమానాలను మోసే సామర్థ్యం ఉంది. ఈ ఎమాల్స్ వ్యవస్థను అమెరికాకు చెందిన 'గెరాల్డ్ ఆర్ ఫోర్డ్' శ్రేణి విమాన వాహన నౌక మాత్రమే వాడుతున్నాయి. ఇటీవల ఈ ఫుజియాన్ గురించి జిన్‌పింగ్ మాట్లాడుతూ.. ఇది సాయుధ దళాల ఆధునికీకరణలో కీలకమైన మైలురాయి అని అభివర్ణించారు. బీజింగ్‌కు ఈ నౌక వ్యూహాత్మక సాధనం అవుతుందని, తమ దేశ గౌరవాన్ని పెంచుతుందన్నారు. ఇదిలాఉండగా.. మరో విమాన వాహక నౌకను నిర్మించేందుకు చైనా సన్నాహాలు మొదలుపెట్టింది. టైప్-004గా ఇది రానుంది. ఇందులో ఎమాల్స్ సాంకేతికతతో పాటు అణు సామర్థ్యంతో దీన్ని నిర్మించాలని బీజింగ్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

# శబరిమలకు ప్రత్యేక రైళ్లు



**హైదరాబాద్, నవంబర్ 7 :** అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం శబరిమలకు ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటు చేసింది. శుక్రవారం నుంచి (నవంబర్ 7) జనవరి వరకు 60 ప్రత్యేక రైళ్లను తిప్పనుంది. చర్లపల్లి, మచిలీపట్నం, నర్సాపూర్ నుంచి శబరిమల సమీప స్టేషన్ల వరకు నడుపుతుంది. శుక్రవారం నుంచి ఈ రైళ్లకు సంబంధించిన టికెట్లు రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉంది. చర్లపల్లి నుంచి కొల్లాం (రైలు నంబర్ 07107)- నవంబర్ 17, 24 తేదీల్లో, డిసెంబర్ 1, 8, 15, 22, 29 తేదీల్లో, జనవరి 5, 12, 19 తేదీల్లో చర్లపల్లి నుంచి బయల్దేరుతాయి. ఇవి మరుసటి రోజు కొల్లాం చేరుకుంటాయి. మొత్తం 10 రైళ్లను అందుబాటులో ఉంచారు. ఇవి పగిడిపల్లి, గుంటూరు, గూడూరు, రేణిగుంటలో ఆగుతాయి. కొల్లాం నుంచి చర్లపల్లి (రైలు నంబర్ 07108)- నవంబర్ 19, 26 తేదీల్లో, డిసెంబర్ 3, 10, 17, 24, 31 తేదీల్లో, జనవరి 7, 14, 21 తేదీల్లో కొల్లా నుంచి బయల్దేరుతాయి. మరుసటి రోజు చర్లపల్లి చేరుకుంటాయి. ఈ రైళ్లు రేణిగుంట, గూడూరు, గుంటూరు, పగిడిపల్లి మీదుగా వస్తాయి.



# వందేమాతర గీతం జాతీయవాద జ్వాలను రగిలిస్తోంది

## కేంద్ర మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, నవంబర్ 7 :** వందేమాతరం గేయానికి 150 ఏళ్లు నిండాయి. స్వాతంత్ర్యోద్యమంలో ఆ గేయం ప్రజల్లో ఎంతో స్ఫూర్తి నింపింది. అయితే ఆ గేయం దేశ ప్రజల్లో ఇప్పటికీ నిరంతరం జాతీయవాద జ్వాలను రగిలిస్తోందని కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. దేశ ఐక్యత, దేశ భక్తి, యువతలో ఉత్తేజానికి ఆ గేయం ఇంకా మూలంగానే ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. తన ఎక్స్ అకౌంట్‌లో కేంద్ర మంత్రి అమిత్ షా ఓ పోస్టు చేశారు. నవంబర్ 7వ తేదీ నుంచి వచ్చే ఏడాది నవంబర్ 7వ తేదీ వరకు వందేమాతరం ఉత్సవాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. వందేమాతర గేయం కేవలం పదాల అల్లిక కాదు అని, అది భారత దేశ అంతరాత్మను అందించిన స్వరమన్నారు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా వందేమాతర గీతం దేశాన్ని ఐక్యంగా నిలిపిందన్నారు. స్వాతంత్ర్యోత్సవ జాగరణను బలోపేతం చేసిందన్నారు. మాతృదేశం కోసం అంకితమయ్యేలా, గర్వపడేలా, స్ఫూర్తి పొందేలా ఆ గేయం విప్లవకారుల్ని ఆకట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాదితో మన జాతీయ గీతానికి 150 ఏళ్లు నిండుతున్నట్లు ఆయన చెప్పారు. ఈ గేయాన్ని కుటుంబ సభ్యులతో కలిసి బలమైన స్వరంలో పూర్తి పాటను పాడాలని, భవిష్యత్తు తరాలకు వందేమాతర గేయం ప్రేరణగా నిలుస్తుందని అమిత్ షా తెలిపారు. వందేమాతర గీతాన్ని బంకిమ్ చంద్ర ఛటర్జీ కంపోజ్ చేశారు. సాహిత్య జర్నల్ బంగదర్శన్‌లో నవంబర్ 7, 1875లో ఈ గేయం పబ్లిష్ అయ్యింది. ఆ తర్వాత 1882లో ప్రచురించిన ఆనందమట్ నవలలోనూ ఈ గేయాన్ని ఆయన పొందుపరిచారు. రబీంద్రనాథ్ ఠాకూర్ ఈ గేయానికి మ్యూజిక్ అందించారు.



# రష్యాలో భారతీయ విద్యార్థి అనుమానాస్పద మృతి

**లక్ష్మణ్‌గఢ్, నవంబర్ 7 :** పాలు కొనడానికి బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. 19 రోజుల తర్వాత అతని మృతదేహం ఓ నదిలో దొరికింది. రాజస్థాన్‌లోని లక్ష్మణ్‌గఢ్ పరిధిలోని కఫన్‌వాడ గ్రామానికి చెందిన అజిత్ సింగ్ చౌధరి అనే యువకుడు.. రష్యాలోని బష్కిర్ స్టేట్ మెడికల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. యూఫా నగరంలో ఉంటున్న అతడు అక్టోబర్ 19న ఉదయం 11 గంటల సమయంలో పాలు కొనుగోలు చేయడానికి వెళ్తున్నానని చెప్పి హాస్టల్ నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాలేదు. దీంతో అదృశ్యమైన అతని గురించి పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం అతని మృతదేహం వైట్ రివర్ డ్యామ్‌లో లభించింది. అయితే దీనిపై రష్యాలోని ఇండియన్ ఎంబసీ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటనా చేయలేదు. కానీ అతని మృతికి సంబంధించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. 19 రోజుల క్రితమే నది ఒడ్డున అతని దుస్తులు, మొబైల్ ఫోన్, బూట్లు లభించాయని విదేశాంగ శాఖ మాజీ మంత్రి జితేంద్ర సింగ్ అల్వార్ వెల్లడించారు. అనుమానాస్పద పరిస్థితుల్లో యువకుడితో ఏదో అసహ్యకరమైన ఘటన జరిగిందని ఎక్స్ వేదికగా ఆయన ఆరోపించారు. ఎన్నో ఆశలతో అతని కుటుంబ సభ్యులు వైద్యవిద్యను అభ్యసించేందుకు 2023లో రష్యాకు పంపించారు. అయితే అతని మృతదేహం నదిలో లభించిందని ఈ రోజు వచ్చిన వార్త దిగ్భ్రాంతి కలిగించిందని పేర్కొన్నారు.



## సామూహిక వందేమాతరం గీతాలాపన

### పాల్గొన్న ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డా. శ్రీజ



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** శుక్రవారం వందేమాతరం గీతాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సామూహిక వందేమాతరం గీతాలాపన కార్యక్రమంలో ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డా. పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డా. పి. శ్రీజ మాట్లాడుతూ, స్వాతంత్ర ఉద్యమంలో కోట్ల మంది భారతీయులకు స్ఫూర్తి నింపిన వందేమాతరం గేయానికి నేటితో 150 ఏళ్లు పూర్తయ్యాయని తెలిపారు. వందేమాతరం గేయంలోని ప్రతి పదం దేశభక్తి భావనతో నిండి, భారతదేశం ఒకటే అని గర్వంగా చెబుతుందని అన్నారు. ఈ గీతం మన దేశ ఐక్యత, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని, ప్రతి ఒక్కరూ ఈ భావనను మనసులో నిలుపుకోవాలని తెలిపారు. వందేమాతరం గేయం ప్రతి పౌరుడిలో దేశభక్తి భావాన్ని పెంపొందిస్తుందని, దేశ చరిత్రలో ఈ గేయం విశేష ప్రాధాన్యత కలిగి ఉందని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలో సామూహికంగా వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్నట్లు ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## భీమదేవరపల్లిలో అక్రమ రిజిస్ట్రేషన్లు

- చేతివాటం చూపిస్తున్న ఇన్చార్జ్ సబ్ రిజిస్ట్రార్
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోని ఉన్నతాధికారులు

**భీమదేవరపల్లి, రాజముద్ర న్యూస్ :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇన్చార్జి సబ్ రిజిస్ట్రార్ చేతివాటం వెలుగులోకి వచ్చింది. ధర్మసాగర్ మండలం ఉనికిచెర్ల గ్రామానికి చెందిన మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇంటి నెంబర్లకు అక్రమంగా రిజిస్ట్రేషన్లు జరిపినట్లు సమాచారం. మున్సిపల్ కార్పొరేషన్ రికార్డుల ప్రకారం ఆ ఇళ్లను "హోల్డర్స్" పేరుతో మాత్రమే చూపిస్తుండగా, వాటిపై రిజిస్ట్రేషన్ చేయడానికి చట్టబద్ధమైన అధికారం లేదని అధికారులు చెబుతున్నారు. ఒక్కో ప్రభుత్వ పట్టా హోల్డర్‌కు 121 గజాలు మాత్రమే ఉండగా, ఇన్చార్జి సబ్ రిజిస్ట్రార్ ప్రతి ఒక్కరికి దాదాపు 240 గజాల చొప్పున అక్రమంగా రిజిస్ట్రేషన్లు జరిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా, ఉనికిచెర్ల గ్రామంలోని 334, 243 సర్వే నంబర్లలో ఎటువంటి అనుమతులు లేకుండా నాన్ లేఅవుట్ వెంచర్‌లో 15 ప్లాట్లకు బౌండరీలు, నంబర్లు ఇచ్చి రిజిస్ట్రేషన్లు చేయడం ద్వారా లక్షల్లో రూపాయలు అక్రమంగా సంపాదించినట్టు సమాచారం. తనపై ఎవరు ఏమీ చేయలేరని బహిరంగంగానే దురుసుగా ప్రవర్తిస్తున్న ఇన్చార్జి సబ్ రిజిస్ట్రార్ వ్యవహారం మండల ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. గతంలో కూడా భీమదేవరపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై పలు ఫిర్యాదులు వచ్చినా, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇన్చార్జి సబ్ రిజిస్ట్రార్ పై శాఖా అధికారులు చర్యలు తీసుకుంటారా? లేక ఈ అవినీతి మమేకం కొనసాగుతుందా? అనే ప్రశ్నలు ప్రజల్లో చర్చనీయాంశమయ్యాయి.



## లక్ష్యం మేరకు చేప పిల్లలను పంపిణీ చేయాలి

### జిల్లా ఇంఛార్జి కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** నవంబర్ నెలాఖరులోగా లక్ష్యం మేరకు చేప పిల్లలను విడుదల చేయాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ తెలిపారు. ఖమ్మం రూరల్ మండల కేంద్రంలో చేప పిల్లల పంపిణీ చేసే డిస్ట్రిబ్యూషన్ పాయింట్ ను శుక్రవారం ఆమె పరిశీలించారు. అనంతరం ఆరెంపుల,బారుగూడెం నల్ల చెరువులో చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల స్థాయిలో డిస్ట్రిబ్యూషన్ కమిటీ ఆధ్వర్యంలో చేప పిల్లల విడుదల సజావుగా జరగాలన్నారు. ఆరెంపుల,బారుగూడెం నల్ల చెరువులో 28 వేల 800 చేప పిల్లలు విడుదల చేయాల్సి ఉన్నదని,రవ్వ,బొచ్చ,బంగారు తీగ రకాల చేప పిల్లలను నల్ల చెరువులో విడుదల చేయడం జరిగిందని చెప్పారు. రూరల్ మండలంలోని 38 చెరువులలో 9.5 లక్షల చేప పిల్లలు నెలాఖరు లోపు విడతల వారీగా విడుదల చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కె.రవికుమార్,ఎంపీవో శ్రీదేవి,ఫిషరీస్ మండల ఇంచార్జ్ లు నవీన్,లక్ష్మణ్,సరిత, పంచాయితీ కార్యదర్శి,వ్యవసాయ విస్తరణ అధికారి,తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ సహాయ గుణాన్ని సంపాదించుకోవాలి

### హఫీజ్ పేట్ డివిజన్ బిజెపి నాయకులు



**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** హఫీజ్ పేట్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ హఫీజ్ పేట్ వద్ద బీజేపీ హఫీజ్ పేట్ డివిజన్ కాంటెస్టడ్ కార్పొరేటర్ బోయిని అనూష మహేష్ యాదవ్ జన్మదిన సందర్భంగా ఓల్డ్ హఫీజ్ పేట్, హుడా కాలనీ, గంగారాం, చందానగర్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో బీజేపీ సీనియర్ నాయకులు కలసి వారికి శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కాట్ చేసి తదనంతరం ఆహారం పాకెట్స్ ను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ కౌన్సిలర్ రమణయ్య, బీజేపీ జిల్లా నాయకులు రవి గౌడ్, తదితరులు అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవ భవాని పెంపొందించుకోవాలి అని అన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ సేవ కార్యక్రమాలు చేపట్టి ప్రధాని నరేంద్ర మోదీ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ ఈ సేవ కార్యక్రమంలో మనమందరం ముందుండి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పని చేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జగన్ గౌడ్, రాజు ముదిరాజ్, బాబు రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, పవన్, నర్సింహా యాదవ్, పాలం శ్రీనివాస్, నవీన్, దేవేందర్ దాస్, రాజేష్, రామారావు, సుబ్బారావు, వినయ్, రాజు, శ్రీను, రాములు, కుమార స్వామి, అనిల్, శివ, చెందు, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వందే మాతరం 150 సంవత్సరాల వేడుక

### జిల్లా ఎస్పి కె.నారాయణ రెడ్డి



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** దేశభక్తి, ఐక్యత, జాతీయ గౌరవానికి ప్రతీకగా నిలిచిన వందే మాతరం జాతీయ గీతం 150 సంవత్సరాల వేడుకలను పురస్కరించుకుని వికారాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో వందే మాతరం గీతం 150 సంవత్సరాల వేడుకలను జిల్లా ఎస్పీ కె.నారాయణ రెడ్డి ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ, పోలీస్ అధికారులు, డిపిఓ సిబ్బంది, హోం గార్డ్స్ అధికారులు అందరూ సామూహికంగా వందేమాతర గీతాన్ని ఆలపించడం జరిగింది. అనంతరం ఇట్టి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వందే మాతరం గీతం మన స్వాతంత్ర్య పోరాటానికి ప్రేరణగా నిలిచిందని, ఈ గీతం భారత మాత పట్ల ఉన్న భక్తి, త్యాగం, దేశాభిమానానికి ప్రతీక అని తెలిపారు. ఈ వేడుకలు ప్రతి భారతీయునిలో దేశభక్తిని, ఐక్యతను, జాతీయ గౌరవాన్ని మరింత బలపరుస్తాయని అన్నారు. జాతీయ గీతం పట్ల గౌరవభావాన్ని పెంపొందించాలని, దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, ఏఆర్ డిఎస్పి వీరేష్, ఏఓ ఖజా మొహినోదిన్, డిఎస్‌బి ఇన్స్పెక్టర్ డివిపి రాజు, ఆర్ఐ లు అంజాత్ పాషా, డేవిడ్, ఎస్ఐ లు,ఆర్ఎస్ఐ లు,డిపిఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నరు.

## పరిసరాలు పరిశుభ్రత మనందరి బాధ్యత

### మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి



**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట పట్టణ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని పట్టణాన్ని చెత్త రహిత పట్టణంగా చేయుటలో ముందుండాలి అని మున్సిపల్ కమిషనర్ సిహెచ్.హన్మంతరెడ్డి తెలిపారు. "స్వచ్ఛ సూర్యాపేట" కార్యక్రమం శుక్రవారం స్థానిక 10వ వార్డు కుప్పిరెడ్డి గూడెంలో "పర్యావరణ పరిశుభ్రత అందరి బాధ్యత" నినాదంతో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ స్వయంగా పాల్గొని వీధి పక్కన పెరిగిన కలుపు మొక్కలను తొలగించారు. ప్రజల్లో పరిశుభ్రత పట్ల చైతన్యం కల్పించేందుకు అధికారులందరినీ ప్రజలతో కలిసి పని చేయాలని ఆయన సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణం పరి శుభ్రంగా ఉండాలంటే ప్రజలు కూడా చురుకుగా ముందుకు రావాలని,"ప్రతి ఇంటి ముందే పరిశుభ్రత ప్రారంభమవుతుందని అన్నారు. చెత్తను రోడ్లపై వేయకుండా తడి చెత్త,పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వడం ద్వారా పట్టణం అందంగా, ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు పట్టణంలోని ప్రతి వార్డులో స్వచ్ఛత, పచ్చదనం, నీటి పరిరక్షణ వంటి అంశాలపై మున్సిపల్ శాఖ క్రమం తప్పకుండా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. శ్రమదానం కేవలం ఒక కార్యక్రమం కాదని,అది "స్వచ్ఛ సూర్యాపేట" లక్ష్యానికి మొదటి అడుగు అని తెలిపారు. పట్టణం అందంగా ఉండేందుకు ప్రతి ఒక్కరు తమ బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు కలసి రహదారుల పక్కన ఉన్న చెత్తను, కలుపు మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్,సానిటరీ ఇన్స్పెక్టర్ సార గండ్ల శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ జాన పాటి నాగయ్య,గౌసుద్దీన్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శివ ప్రసాద్ ,టీఎంసీ శ్వేత ,వార్డ్ అధికారి పల్లపు నరేష్ ,మున్సిపల్ సిబ్బంది,వార్డు అధికారులు,పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు కూడా మున్సిపల్ కమిషనర్ పిలుపుకు స్పందించి స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని శుభ్రతకు తమ వంతు సహకారం అందించారు.

## సామూహికంగా వందేమాతర గీతాలాపన

- స్వాతంత్రోద్యమంలో వందేమాతర గీతం ఒక మహా ఉద్యమం
- పౌరులను ఏకతాటిపై నడిపిన గీతం
- నేటి బాలలే రేపటి పౌరులు
- దేశ ఐకమత్యాన్ని, ఔన్నత్యాన్ని చాటాలి
- సూర్యాపేట ఎస్పి నరసింహ





**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట జిల్లా కేంద్రంలో నూట యాభై వసంతాల వందేమాతర ఉత్సవం సందర్భంగా 2000 మంది పౌరులు,విద్యార్థులు, పోలీసు సిబ్బందితో నిర్వహించిన భారీ ర్యాలీలో జిల్లా ఎస్పీ నర్సింహా ఐపిఎస్ పాల్గొని మాట్లాడారు. వందేమాతర గీతం రచించి నూట యాభై సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని స్థానిక 60 ఫీట్ రోడ్డు నుండి వాణిజ్య భవన్ సెంటర్ వరకు వందేమాతరం నినాదాలు భారత్ మాతాకీ జై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించరు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భారతదేశం యొక్క స్థితిగతులను భారతదేశంలో ఉన్న పరిస్థితులను ప్రజల యొక్క అభిమతాన్ని తెలియపరుస్తూ బంకించంద్ర చటర్జీ ఈ వందేమాతర గీతాన్ని రచించి నేటికీ నూట యాభై సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా జిల్లా కేంద్రంలో ఘనంగా ర్యాలీ నిర్వహించడం జరిగింది అన్నారు. వందేమాతర గీతం భారతదేశానికి స్వతంత్రం రాకముందు ప్రతి పల్లెలో ప్రతి పట్టణంలో కులమతాలకు అతీతంగా ప్రజలను చైతన్య పరిచి ముందుకు తీసుకువచ్చి ఐక్యతతో భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించడంలో ముఖ్య భూమిక పోషించిందని వందేమాతరం యొక్క గొప్పతనం ఈ పాట వలన ఎందరో త్యాగధనులు దేశం కోసం పోరాడిన గొప్ప చరిత్ర ఈ పాటకు ఉందని తెలియజేశారు సూర్యాపేట పట్టణంలో వివిధ పాఠశాల విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీగా పాల్గొని వాణిజ్య భవన్ సెంటర్లో జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి జనార్దన్ రెడ్డి,డిఎస్పి ప్రసన్నకుమార్,నరసింహ చారి, సిఐ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు,ఎస్ ఐ లు పోలీసు సిబ్బంది,పట్టణ ప్రముఖులు,వందేమాతరం గీతాలాపన కమిటీ సభ్యులు నాగవెల్లి ప్రభాకర్,పర్వతం శ్రీధర్ కుమార్,తోట శ్యామ్ ప్రసాద్, ప్రసన్న,దశరథ,సృజన కుమార్ , ఉపేందర్,వెంకట్ రెడ్డి,హైమవతి, శ్రీదేవి, నరసింహ,వివిధ పాఠశాలల విద్యార్థులు,ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## పరిసరాలు పరిశుభ్రత మనందరి బాధ్యత

### మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట పట్టణ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని పట్టణాన్ని చెత్త రహిత పట్టణంగా చేయుటలో ముందుండాలి అని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హన్మంతరెడ్డి తెలిపారు. "స్వచ్ఛ సూర్యాపేట" కార్యక్రమం శుక్రవారం స్థానిక 10 వ వార్డు కుప్పిరెడ్డి గూడెంలో "పర్యావరణ పరిశుభ్రత అందరి బాధ్యత"నినాదంతో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ స్వయంగా పాల్గొని వీధి పక్కన పెరిగిన కలుపు మొక్కలను తొలగించారు. ప్రజల్లో పరిశుభ్రత పట్ల చైతన్యం కల్పించేందుకు అధికారులందరినీ ప్రజలతో కలిసి పనిచేయాలని ఆయన సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణం పరి శుభ్రంగా ఉండాలంటే ప్రజలు కూడా చురుకుగా ముందుకు రావాలని,"ప్రతి ఇంటి ముందే పరిశుభ్రత ప్రారంభమవుతుందని అన్నారు. చెత్తను రోడ్లపై వేయకుండా తడి చెత్త,పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వడం ద్వారా పట్టణం అందంగా, ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు పట్టణంలోని ప్రతి వార్డులో స్వచ్ఛత,పచ్చదనం,నీటి పరిరక్షణ వంటి అంశాలపై మున్సిపల్ శాఖ క్రమం తప్పకుండా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. శ్రమదానం కేవలం ఒక కార్యక్రమం కాదని,అది "స్వచ్ఛ సూర్యాపేట" లక్ష్యానికి మొదటి అడుగు అని తెలిపారు. పట్టణం అందంగా ఉండేందుకు ప్రతి ఒక్కరు తమ బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అధికారులు,సిబ్బంది,స్థానిక ప్రజలు కలసి రహదారుల పక్కన ఉన్న చెత్తను,కలుపు మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్,సానిటరీ ఇన్స్పెక్టర్ సార గండ్ల శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ జాన పాటి నాగయ్య,గౌసుద్దీన్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శివ ప్రసాద్ ,టీఎంసీ శ్వేత ,వార్డ్ అధికారి పల్లపు నరేష్ ,మున్సిపల్ సిబ్బంది,వార్డు అధికారులు,పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు కూడా మున్సిపల్ కమిషనర్ పిలుపుకు స్పందించి స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని శుభ్రతకు తమ వంతు సహకారం అందించారు.



## లంకాల దీపిక్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించండి

### బిజెపి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి లంకాల దీపక్ రెడ్డి విజయం సాధించడం ఖాయమని బిజెపి నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ అన్నారు. లంకాల దీపక్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం యూసఫ్ గూడలో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన బూటకపు హామీలు అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. పదేళ్లు బీఆర్ఎస్, రెండేళ్లుగా కాంగ్రెస్ పాలన చూసిన ప్రజలు ఇక ఆ పార్టీలను నమ్మే స్థితిలో లేరని,ప్రత్యామ్నాయంగా బీజేపీ అభ్యర్థి విజయం సాధిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజవర్గం అభివృద్ధి జరుగక పోవడంతో ప్రజల స్థితిగతుల్లో ఎలాంటి మార్పు రాలేదని దీంతో ప్రజలు లంకాల దీపక్ రెడ్డిని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు. ప్రచారంలో భాగంగా పాగర్తి సుధాకర్ లాండ్రీ చేస్తూ,ఇడ్లీలు వేస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులు లింగాల లక్ష్మినారాయణ,మహిళ మోర్చా నాయకులు,పార్టీ శ్రేణులు,తదితరులు పాల్గొన్నారు.






## నాడు నాటు కూలి.. నేడు బస్సు కండక్టర్

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట మండలం రామారం గ్రామానికి చెందిన శారద నిరుపేద కుటుంబం లో పుట్టి ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఇంటి వద్ద ఉండకుండా తన తోటి వారితో కలిసి పొలం పనులకు కూలికి వెళుతుండేది ఆమె తల్లిదండ్రులు ఇమాంపేట గ్రామానికి చెందిన యువకుని తో వివాహం భర్తతో కలిసి శారద ఇమాంపేటలో నివాసం ఉంటూ కూలి నాలి పనులు చేసుకుంటూ ప్రభుత్వ ఉద్యోగాలు ఏమైనా పడితే ఎగ్జామ్స్ రాస్తూ ఉండేది ఈ సంవత్సరం ప్రభుత్వం కండక్టర్ ఉద్యోగాలు రిక్రూట్మెంట్ చేయగా మొదటి ప్రయత్నంలోనే కండక్టర్ ఉద్యోగం శారద సాధించింది ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ మా తల్లిదండ్రులు కష్టపడి చదివించారాని నేను కూలి నాలి పనులకు వెళ్తు ఉండేదాన్ని కష్టం విలువ తెలిసిన నాకు నా భర్త సహాయంతో ఎగ్జామ్స్ ప్రిపేర్ అయ్యి కండక్టర్ ఉద్యోగం సాధించానని కష్టపడి చదివితే తప్పకుండా ఫలితం ఉంటుందని నాకు సహకరించిన మా తల్లిదండ్రులకు నా భర్తకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ ఆనందం వ్యక్తం చేశారు.

# ఐటిఐ కళాశాలను సర్వే నెంబర్ 254లో నిర్మించాలి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** తిరుమలాయపాలెం మండల కేంద్రానికి మంజూరైన ప్రభుత్వ ఐటిఐ కళాశాలను దళితుల(మాదిగ) స్మశాన వాటిక పక్కన గల ప్రభుత్వ భూమిలో నిర్మించవద్దని స్థానిక మాదిగ కులస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు.శుక్రవారం మాదిగలు అంతా కలసి సంబంధిత స్థలంలో పాతిన సరిహద్దు రాళ్లను పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిపాదిత స్థలంలో గత నాలుగు తరాల పూర్వీకులు నివాసం ఉండి క్రమక్రమాన రహదారి వైపు తరలివెళ్లారన్నారు.నివాసాలు మారినప్పటికి,ఇదే స్థలంలో ప్రతిష్టించబడిన ముత్యాలమ్మ, పోతురాజు గ్రామ దేవతలను తరతరాలుగా పూజిస్తున్నామని,ప్రస్తుతం ఈ స్థలంలో ఐటిఐ కళాశాల నిర్మాణం చేస్తామనడం సరైంది కాదన్నారు.దీనికి తోడు సరిహద్దుగా ఉన్న స్మశాన వాటికతో విధ్యార్థులు,అధ్యాపకులకి అంతరాయం కలుగుతుందని తెలిపారు.ఐటిఐ కళాశాలను ప్రధాన రహదారి వారగా ఉన్న సర్వే నెంబరు 254 ఖాళీ స్థలంలో ఐటిఐ కళాశాలను నిర్మించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కొమ్ము వీరబాబు,బిఎస్పీ నాయకులు ఎన్నబోయిన రమేష్,కొమ్ము పూలే,తదితరులు పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలకు పీఎస్ఆర్ ట్రస్ట్ చేయూత

### 28 గ్రామాల్లో 60 కుటుంబాలకు ఆర్థికసాయం పంపిణీ

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** కష్టకాలంలో ఉన్న ప్రజల కుటుంబాలను ఆదుకోవడంలో పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటుందని మాజీ ఎంపీపీ బోడా మంగీలాల్ అన్నారు.తిరుమలాయపాలెం మండలంలో అక్టోబర్ 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు వివిధ కారణాల వల్ల మరణించిన వ్యక్తుల కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పర్యవేక్షణలో నడుస్తున్న పిఎస్ఆర్ ట్రస్ట్ తరపున శుక్రవారం సహాయక కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని వేదుళ్లచెర్వు, పిండిప్రోలు, తెట్టెలపాడు, దమ్మాయిగూడెం, జింకలగూడెం, గోల్ తండా, పాతర్లపాడు, తిప్పారెడ్డిగూడెం, జల్లేపల్లి, హైదర్ సాయిపేట, పడమటి తండా, చింతలతండా (చంద్రు తండా), మేడిదపల్లి, ఇస్లావత్ తండా, సుబ్లేడు, హస్నాబాద్, రఘునాధపాలెం, మంగలిబండ తండా, కాకరవాయి, ఏనుకుంట తండా, సోలీపురం, పైనంపల్లి, బచ్చోడు తండా, బచ్చోడు, బీరోలు, ఎర్రగడ్డ, కొక్కిరేణి, తిరుమలాయపాలెం గ్రామాల్లో 60 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి పది వేల రూపాయల నగదును ఆర్థిక సాయంగా అందించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నం రాజశేఖర్,గుర్రాల శ్రీనివాస రెడ్డి,పొట్ల కిరణ్, గూడూరు ఉపేందర్,ఉమా మహేశ్వర్,ఉప్పునూతల నాగేశ్వరావు,పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



## హైదరాబాద్‌లో ప్రారంభమైన జాతీయ గిరిజన ఉత్సవం 'ఆది బజార్-2025'

### ఆది బజార్ గిరిజన కళాకారులకు మార్కెట్‌ను అందుబాటులోకి తెస్తుంది : దివ్య దేవరాజన్, ఐఏఎస్

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:** హైటెక్ సిటీలోని శిల్పారామం సమీపంలో గల ఇందిరా మహిళా శక్తి బజార్‌లో జాతీయ గిరిజన ఉత్సవం "ఆది బజార్ – 2025" ను సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (ఎస్ఈఆర్‌పీ) సీఈవో దివ్య దేవరాజన్, ఐఏఎస్ శుక్రవారం ప్రారంభించారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో... హైదరాబాద్‌లోని టీఆర్ఐఎఫ్ఈడీ (ఆంధ్రప్రదేశ్–తెలంగాణ) ప్రాంతీయ కార్యాలయం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ 10 రోజుల ఉత్సవం నవంబర్ 7 నుంచి 16 వరకు జరుగుతుంది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, తెలంగాణ సహా ఇతర రాష్ట్రాల నుంచి దాదాపు 70 మంది గిరిజన కళాకారులు ఈ ఉత్సవంలో పాల్గొంటారు. ప్రారంభ కార్యక్రమంలో దేవరాజన్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది గిరిజన కళాకారులకు ఇప్పటికీ తగినంత మార్కెట్ అనుభవం లేదన్నారు. "వినియోగదారులతో అనుసంధానమయ్యేందుకు, వారి ఆదాయాలను పెంచుకునేందుకు, సాంప్రదాయ జీవనోపాధిని ప్రోత్సహించేందుకు గిరిజనుల కోసం ఆది బజార్ ప్రత్యక్ష వేదికను అందిస్తుంది" అని ఆమె వ్యాఖ్యానించారు. గిరిజన వర్గాల ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా పౌరులు వారికి మద్దతునివ్వాలని దేవరాజన్ కోరారు. గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న గిరిజన వర్గాల సాంస్కృతిక వారసత్వం, నైపుణ్యాలను ఇది ప్రదర్శిస్తుంది. ఈ ప్రదర్శన–కమ్–సేల్‌లో గోండ్ (మధ్యప్రదేశ్), భీల్ (రాజస్థాన్), వార్లి (మహారాష్ట్ర)లకు చెందిన పెయింటింగ్‌లు... చందేరి, బాగ్ ప్రింట్ టెక్స్‌టైల్స్ (మధ్యప్రదేశ్)... బాగ్రు ప్రింట్ ఫాబ్రిక్స్ (రాజస్థాన్)... టస్సర్ సిల్క్ (ఛత్తీస్‌గఢ్)... తమిళనాడు నుంచి గిరిజన ఆభరణాలు... ఆసిఫాబాద్ (తెలంగాణ) నుంచి బంజారా ఎంబ్రాయిడరీ, లోహపు కళాకృతులు... గిరిజన ఉత్పత్తిదారుల సమూహాల నుంచి ఆర్గానిక్, సహజసిద్ధ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలు ఉంటాయి. సాంప్రదాయ కళాకారులు రూపొందించిన కళాకృతులు, వస్తువులను పట్టణ మార్కెట్లు, పర్యాటకులు, హస్త కళాకృతుల ఔత్సాహికులతో అనుసంధానించడం ద్వారా గిరిజన వర్గాలకు స్థిరమైన జీవనోపాధిని విస్తరించడం ఈ ఉత్సవాల లక్ష్యం.

## స్టాక్ మార్కెట్ నష్టాలతో ఇంజనీర్ ఆత్మహత్య

**అరిహంత్ విహార్, నవంబర్ 7 :** స్టాక్ మార్కెట్లో భారీ నష్టాలతో ఒక ఇంజనీర్ పొగతో నిండిన గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు, ఆస్తి తగాదాల కారణంగా తాను ఈ తీవ్రమైన చర్య తీసుకుంటున్నానని లవ్ కుమార్ రాసిన సూసైడ్ నోట్ గది నుండి లభించిందని పోలీసులు వెల్లడించారు. ఈ సంఘటన బుధవారం ఉత్తరాఖండ్‌లోని అరిహంత్ విహార్ ప్రాంతంలో జరిగింది. వృత్తిరీత్యా కెమికల్ ఇంజనీర్ అయిన లవ్ కుమార్ తన గదిలోని హీటర్‌పై బొగ్గును మండించి పొగను సృష్టించి, లోపల ఉండి తాళం వేసుకుని ఊపిరాడక మరణించాడు. దీనికి ముందు కుమార్ తన భార్యకు వాట్సాప్‌లో కార్బన్ మోనా క్సైడ్ తాగి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తూ సందేశం పంపాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమార్ స్టాక్ మార్కెట్ నష్టాలతో తీవ్ర మనస్తాపానికి గురై మద్యానికి బానిసయ్యాడు. ఈ అలవాటుతో ఇబ్బంది పడిన అతని భార్య తన పిల్లలతో కలిసి తల్లిదండ్రుల ఇంటికి వెళ్లింది. కుమార్ సందేశాన్ని వాట్సాప్‌లో చూసిన తర్వాత ఆమె పదేపదే అతనికి ఫోన్ చేసింది. కానీ అతను ఫోన్‌కు సమాధానం ఇవ్వకపోవడంతో అతని కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు వచ్చి తలుపు పగలగొట్టి చూసేసరికి గది పొగతో నిండిపోయింది, కుమార్ అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే అతన్ని ఆసుపత్రికి తీసుకెళ్లారు, అక్కడ వైద్యులు అతను చనిపోయినట్లు ప్రకటించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.






# వందేమాతరం 150 ఏళ్ల ఉత్సవం ప్రారంభం

### ఉత్సవంలో పాల్గొన్న పీఐబీ హైదరాబాద్

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:** సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ), డీపీడీ యూనిట్లతో కలిసి హైదరాబాద్‌లోని పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) శుక్రవారం భారతదేశ జాతీయ గేయం "వందేమాతరం" 150వ వార్షికోత్సవాన్ని దేశభక్తి భావనతో ఉత్సాహంగా నిర్వహించింది. అధికారులు, సిబ్బంది 'వందేమాతరాన్ని' సామూహికంగా ఆలపించారు. మాతృభూమి పట్ల ఐక్యత, భక్తిని చాటుతున్న ఈ గేయం అందిస్తోన్న వెలకట్టలేని కాలాతీత సందేశాన్ని తెలియజేసేలా కార్యాలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సీబీసీ హైదరాబాద్ సిబ్బంది కూడా ఉల్లాసభరితమైన నృత్య ప్రదర్శన చేశారు. పీఐబీ హైదరాబాద్ ఏడీజీ శ్రుతి పాటిల్ (ఐఐఎస్) మాట్లాడుతూ.. ఈ గేయానికి ఉన్న అసలైన, పరివర్తనాత్మక స్ఫూర్తితో పౌరులను తిరిగి అనుసంధానించడానికిఈ గేయ వారసత్వాన్ని భవిష్యత్ తరాల మనస్సుల్లో నిక్షిప్తమై ఉండేలా చూడటానికి దేశవ్యాప్తంగా ఉత్సవాలను నిర్వహించాలన్న ప్రతిపాదనకు 2025 అక్టోబర్ 1న కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందని చెప్పారు. బంకిమ్‌చంద్ర ఛటర్జీ 'వందేమాతరాన్ని' రచించి 2025 నాటికి 150 సంవత్సరాలు పూర్తవుతోంది. ఇది మొదటగా 1875 నవంబర్ 7న బంగాదర్శన్ అనే సాహిత్య పత్రికలో ప్రచురితమైంది. 'ఆనందమఠ్' అనే నవలలో భాగంగా ఆయన దీనిని రచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో ఏడాది పొడవునా జరిగే ఉత్సవాలను ప్రారంభించారు. పీఐబీ హైదరాబాద్, సీబీసీ హైదరాబాద్, డీపీడీ, సీబీఎఫ్‌సీ అధికారులు, సిబ్బంది ఈ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. తద్వారా దేశభక్తి, ఐక్యతను చాటుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న '150 ఏళ్ల వందేమాతరం' జాతీయ వేడుకలో భాగమయ్యారు.

# త్వరలో భారత్‌లో పర్యటిస్తా

- ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి, నా మిత్రుడు
- వాణిజ్య సంబంధాలను పటిష్టం చేస్తా
- డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, నవంబర్ 7 :** అమెరికా– భారత్ మధ్య టారిఫ్ ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి, తన మిత్రుడు అంటూ కొనియాడారు. అలాగే, ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను పటిష్టం చేసే ప్రయత్నాల్లో భాగంగా, వచ్చే ఏడాది తాను భారత్‌ను సందర్శించే అవకాశం ఉందని ట్రంప్ ప్రకటించారు. వైట్‌హౌస్‌లో ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా భారత్‌తో వాణిజ్య చర్చలపై విలేకరులు ప్రశ్నలు అడిగారు. ఈ క్రమంలో మోదీతో తన చర్చలు అద్భుతంగా సాగుతున్నాయని ట్రంప్ సమాధానం చెప్పారు. ప్రధాని మోదీ రష్యా నుంచి ఇంధన కొనుగోలును చాలా వరకు ఆపేశారు. ఆయన నాకు మిత్రుడు, మేము మాట్లాడుతుంటాం. మోదీ గొప్ప వ్యక్తి. ఆయన నాకు మిత్రుడు, ఆయన నన్ను అక్కడికి రావాలని ఆహ్వానించారు. నేను తప్పకుండా వెళతాను. పర్యటనను ఖరారు చేస్తామని అన్నారు. తాను భారత్‌కు వెళతానని ట్రంప్ చెప్పిన నేపథ్యంలో వచ్చే ఏడాది వెళ్లే అవకాశం ఉందా? అని విలేకరులు అడిగారు. దీనికి ట్రంప్ బదిలిస్తూ ' అవును, వచ్చే ఏడాది ఉండొచ్చు' అని సమాధానం చెప్పారు. వాస్తవానికి భారత్?లో జరగాల్సిన క్వాడ్ మీటింగ్‌కు ట్రంప్ రావాల్సి ఉంది. అయితే ట్రంప్ ఇకపై క్వాడ్ సమ్మిట్ కోసం భారత్‌కి రాకపోవచ్చని అన్నారు. ఈ ఏడాది ఆగస్టులో ఒక వ్యాసంలో పేర్కొంది. భారత్‌తో వాణిజ్య సుంకాల (టారిఫ్) వివాదాల నేపథ్యంలో ఆ ప్రయాణాన్ని వాయిదా వేసినట్లు ఆ రిపోర్ట్ తెలియజేసింది. అయితే ట్రంప్ తాజాగా చేసిన వ్యాఖ్యలు రెండు దేశాల మధ్య సంబంధాలు మళ్లీ సానుకూల దిశలో సాగుతున్నాయనే సంకేతంగా భావించవచ్చు. ప్రస్తుతం భారత్ – అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కీలక దశలో ఉన్నాయి. ఈ క్రమంలో ట్రంప్ నుంచి ఇలాంటి కామెంట్స్ రావడం ప్రాధాన్యత సంతరించుకొన్నది. రష్యా చమురును భారత్ కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో అమెరికా అదనంగా 25 శాతం సుంకాలని విధించిన విషయం తెలిసిందే. ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యాను ఆర్థికంగా ఒంటరి చేయాలని భారత్‌పై ట్రంప్ అదనపు సుంకాలను విధించారు. అయితే, తాజాగా భారత్ రష్యా నుంచి ఇంధన కొనుగోళ్లను తగ్గించుకోవాలని నిర్ణయించినట్లు ఇటీవల ట్రంప్ స్వయంగా ప్రకటించారు. అంతేకాకుండా, ఆగిపోయిన వాణిజ్య చర్చలు కూడా ఫలప్రదంగా సాగుతున్నట్లు వెల్లడించారు. దీపావళి రోజు కూడా మోదీకి కాల్ చేసి ట్రంప్ శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు రష్యా చమురు కొనుగోలు, వాణిజ్యంపై చర్చించినట్లు ట్రంప్ మరోసారి పునరుద్ఘాటించారు. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ కూడా దీనిపై క్లారిటీ ఇచ్చారు. అధ్యక్షుడు ట్రంప్ భారత్–అమెరికా సంబంధాలపై సానుకూలంగా ఉన్నారని, వైట్‌హౌస్‌లో జరిగిన దీపావళి వేడుకల సందర్భంగా ప్రధాని మోదీతో నేరుగా మాట్లాడారని ధృవీకరించారు. అయితే రష్యా నుంచి భారత్ ఇంధన కొనుగోళ్లను తగ్గించుకుంటుందన్న ట్రంప్ వ్యాఖ్యలపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఈ నెల ప్రారంభంలో స్పందించింది. తమ దేశం ఇంధన విధాన నిర్ణయాలు జాతీయ ప్రయోజనాలు, వినియోగదారుల సంక్షేమం ఆధారంగా మాత్రమే ఉంటాయని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు.

## ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో సాంకేతిక సమస్య

### విమానాల రాకపోకలకు అంతరాయం



**న్యూఢిల్లీ, నవంబర్ 7 :** దేశ రాజధాని ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం ఉదయం సాంకేతిక సమస్య తలెత్తింది. ఎయిర్‌పోర్టులోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలో సాంకేతికలోపం తలెత్తడంతో విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. దీని కారణంగా దాదాపు 100కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు అధికారులు తెలిపారు. దేశంలోనే అత్యంత రద్దీ విమానాశ్రయాల్లో ఒకటైన ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రోజుకు 1500లకు పైగా విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎయిర్ ఇండియా విమానంలో ప్రయాణిస్తున్న ఒకరు ఈ విషయాన్ని వెల్లడించారు. తాము ప్రయాణిస్తున్న విమానం రన్‌వేపై అరగంటకు పైగా నిలిచిపోయిందని, ఏటీసీ సిస్టమ్‌లో సమస్య వల్లే ఈ జాప్యం జరిగిందని సిబ్బంది తెలియజేశారని ఆయన పేర్కొన్నారు. ఈ గ్లిచ్ కారణంగా విమానాల రాకపోకలు రెండింటికీ కొంతసేపు అంతరాయం ఏర్పడింది. దీంతో బోర్డింగ్ గేట్ల వద్ద ప్రయాణికుల రద్దీ పెరిగిపోయింది. సాంకేతిక బృందాలు సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్ని స్తున్నాయని, త్వరలోనే కార్యకలాపాలు సాధారణ స్థితికి వస్తా యని ఎయిర్ ఇండియా సిబ్బంది ప్రయాణికులకు సర్దిచెప్పా రు. ఆశ్చర్యకరంగా ఇదే విమానాశ్రయంలో ఇలాంటి సాంకేతి క సమస్య తలెత్తడం ఈ వారంలో ఇది రెండోసారి. కేవలం రెండు రోజుల క్రితం, బుధవారం నాడు కూడా ఇదే తరహాలో సమస్య తలెత్తగా, దాన్ని పరిష్కరించినట్లు, కార్యకలాపాలు సాధారణ స్థితికి వచ్చాయని విమానాశ్రయ అధికారులు ప్రకటించారు. ప్రయాణికులు తమ ప్రయాణ ప్రణాళికలతో ముందుకు సాగవచ్చని కూడా సూచించారు. బుధవారం నాటి సమస్యపై ఎయిర్ ఇండియా స్పందిస్తూ.. థర్డ్ పార్టీ కనెక్టివిటీ నెట్‌వర్క్‌లో సమస్య కారణంగా కొన్ని ఎయిర్‌లైన్స్‌తో పాటు తమ చెక్–ఇన్ సిస్టమ్‌లు కూడా ప్రభావితమయ్యాయని, అందుకే విమానాలు ఆలస్యమయ్యాయని 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తెలిపింది. సిస్టమ్‌ను పునరుద్ధరించామని, అయితే పరిస్థితి చక్కబడే వరకు కొన్ని విమానాలు ఆలస్యంగా నడవొచ్చని వివరించింది. అయితే, అంతా సర్దుకుందని ప్రక టించిన రెండు రోజులకే అదే తరహా సమస్య పునరావృతం కావడంతో ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురయ్యారు. తాజా ఘటనపై ఎయిర్‌లైన్స్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.




## విమానయాన రంగంపై షట్‌డౌన్ తీవ్ర ప్రభావం

- సిబ్బంది కొరతతో వందలాది విమానాల రద్దు
- గంటల తరబడి విమానాల రాకపోకలకు ఆలస్యం

**చికాగో, నవంబర్ 7 :** అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్ ప్రభావం విమానయాన రంగంపై తీవ్రంగా పడింది. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి పెరగడంతో దేశవ్యాప్తంగా వందలాది విమానాలు రద్దయ్యాయి. దీంతో ప్రయాణికులు తమ ప్రయాణాలను రీ షెడ్యూల్ చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన విమానాశ్రయాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. భద్రతా కారణాల దృష్ట్యా దేశంలోని రద్దీ ఎక్కువగా ఉండే 40 ప్రాంతాల్లో విమాన సర్వీసులను 10 శాతం వరకు తగ్గించాలని ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ విమానయాన సంస్థలను ఆదేశించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం నాటికి 750కి పైగా విమాన సర్వీసులను ముందుగానే రద్దు చేసినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్‌అవేర్ వెల్లడించింది. ప్రముఖ విమానయాన సంస్థ అమెరికన్ ఎయిర్‌లైన్స్ రోజుకు 220 విమానాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించగా, డెల్టా ఎయిర్‌లైన్స్ శుక్రవారం 170 సర్వీసులను, సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ 100 సర్వీసులను నిలిపివేసినట్లు తెలిపాయి. ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు, విమానాశ్రయ భద్రతా సిబ్బంది సహా వేలాది మంది కీలక ఉద్యోగులకు జీతాలు అందడం లేదు. దీంతో సిబ్బంది కొరత ఏర్పడింది. చాలామంది అనారోగ్య కారణాలతో సెలవులు పెడుతుండటంతో ఏటీసీ సేవలకు అంతరాయం కలుగుతోంది. ఇప్పటికే గురువారం 6,400కు పైగా విమానాలు ఆలస్యంగా నడవగా, 200 సర్వీసులు రద్దయ్యాయి. బోస్టన్, నెవార్క్ విమానాశ్రయాల్లో ప్రయాణికులు రెండు గంటలకు పైగా, షికాగో, వాషింగ్టన్ ఎయిర్‌పోర్టుల్లో గంటకు పైగా వేచి చూడాల్సి వచ్చింది. "ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, ముందే మేల్కోవడం మంచిదని భావిస్తున్నాం. పరిస్థితులు దిగజారకముందే ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం" అని ఎఫ్ఏఏ అడ్మినిస్ట్రేటర్ బ్రయాన్ బెడ్‌ఫోర్డ్ తెలిపారు. కొన్ని వారాల్లో థ్యాంక్స్‌గివింగ్ సెలవులు రానున్న నేపథ్యంలో ప్రయాణాల రద్దీ మరింత పెరగనుంది. ఈ సమయంలో విమానాల రద్దు ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేయనుంది. అట్లాంటా, డెన్వర్, చికాగో, హ్యూస్టన్, లాస్ ఏంజిల్స్ వంటి ప్రధాన విమానాశ్రయాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉండనుంది. అయితే, విమాన ప్రయాణాలు సురక్షితమేనని, ప్రయాణికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రవాణా శాఖ కార్యదర్శి సీన్ డఫీ భరోసా ఇచ్చారు. కాగా, తన 35 ఏళ్ల సర్వీసులో ఇలాంటి పరిస్థితులను ఎప్పుడూ చూడలేదని, ప్రభుత్వ షట్‌డౌన్‌ల విషయంలో ఇది ఒక కొత్త అనుభవమని బెడ్‌ఫోర్డ్ వ్యాఖ్యానించారు.

## మినిట్‌మ్యాన్-3 క్షిపణి ప్రయోగం

### శక్తిమంతమైన క్షిపణిని పరీక్షించిన అమెరికా




**కాలిఫోర్నియా, నవంబర్ 7 :** అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ, అమెరికా తన అణు సామర్థ్యాన్ని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. కాలిఫోర్నియాలోని వాండెన్‌బర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుంచి నవంబర్ 5న 'మినిట్‌మ్యాన్–3' అనే ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. ఇది కేవలం ఆయుధ వ్యవస్థల విశ్వసనీయతను అంచనా వేయడానికి చేపట్టిన రొటీన్ పరీక్ష అని అధికారులు ప్రకటించినప్పటికీ, దీని వెనుక బలమైన వ్యూహాత్మక కారణాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. యూఎస్ ఎయిర్ ఫోర్స్ గ్లోబల్ స్ట్రైక్ కమాండ్ ఈ ప్రయోగాన్ని ధ్రువీకరించింది. ఈ క్షిపణి సుమారు 7,500 కిలోమీటర్లు ప్రయాణించి, పసిఫిక్ మహాసముద్రంలోని మార్షల్ దీవుల సమీపంలో ఉన్న రోనాల్డ్ రీగన్ బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్ టెస్ట్ సైట్‌లోని లక్ష్యాన్ని కచ్చితత్వంతో ఛేదించిందని అధికారులు తెలిపారు. ఇది కేవలం వ్యవస్థల పనితీరు, వేగం, కచ్చితత్వాన్ని అంచనా వేయడానికి చేపట్టిన రొటీన్ పరీక్ష అని, ఇందులో ఎలాంటి అణు వార్‌హెడ్‌లు ఉపయోగించలేదని పెంటగాన్ స్పష్టం చేసింది. రష్యా, చైనా, పాకిస్థాన్ వంటి దేశాలు అణు పరీక్షలు నిర్వహిస్తున్నాయని, ఈ పోటీలో అమెరికా వెనుకబడకూడదన్న ఉద్దేశంతో అధ్యక్షుడు ట్రంప్ ఈ పరీక్షలకు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఎలాంటి పేలుడు పదార్థాలతో కూడిన అణు పరీక్షలు నిర్వహించబోమని అమెరికా ఇంధన శాఖ స్పష్టం చేసినప్పటికీ, ఈ ప్రయోగం ప్రచ్ఛన్నయుద్ధ కాలం నాటి అణు పోటీని గుర్తుచేస్తోందని నిపుణులు అంటున్నారు. మినిట్‌మ్యాన్–3 అమెరికా అమ్ములపొదిలో అత్యంత పురాతనమైన, భూమి నుంచి ప్రయోగించే ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి. 1970ల నుంచి ఇది సేవలో ఉంది. నిమిషం వ్యవధిలోనే ప్రయోగించగలదు కాబట్టే దీనికి ఆ పేరు వచ్చింది. ఇది సుమారు 13,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను కూడా ఛేదించగలదు. ప్రస్తుతం అమెరికా వద్ద ఇలాంటివి 400 క్షిపణులు ఉన్నాయి. 2030 నాటికి వీటి స్థానంలో కొత్త క్షిపణులను ప్రవేశపెట్టాలని అమెరికా యోచిస్తోంది.ఈ ప్రయోగం అణ్వాయుధాల భయానక విధ్వంసాన్ని మరోసారి గుర్తు చేస్తోంది. ప్రస్తుతం అమెరికా వద్ద ఉన్న అత్యంత శక్తిమంతమైన 83 అణు బాంబు సామర్థ్యం 1.2 మెగాటన్నులు. అంటే హిరోషిమా బాంబు కంటే 80 రెట్లు ఎక్కువ. ఇది ఒక నగరంపై పడితే 10–15 కిలోమీటర్ల పరిధిలోని ప్రతిదీ బూడిదైపోతుంది. ఇటీవల, ప్రపంచాన్ని 150 సార్లు నాశనం చేయగల అణ్వాయుధాలు తమ వద్ద ఉన్నాయని అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. నిపుణుల అంచనా ప్రకారం, నాగరికతను నాశనం చేయడానికి 100–400 అణు వార్‌హెడ్‌లు చాలు. ఈ నేపథ్యంలో, మినిట్‌మ్యాన్–3 వంటి పరీక్షలు ఒకవైపు అమెరికా సైనిక సన్నద్ధతను చాటుకోవడానికే కాకుండా, ప్రత్యర్థి దేశాలకు ఒక హెచ్చరికగా కూడా ఉపయోగపడతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# మూడోరోజూ నష్టాల్లో సూచీలు..




**ముంబయి:** అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, విదేశీ మదుపర్ల అమ్మకాలతో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడోరోజూ నష్టాల్లో ముగిశాయి. ఉదయం భారీ నష్టాల్లో ట్రేడయిన సూచీలు.. పీఎస్‌యూ బ్యాంకుల్లో కొనుగోళ్ల మద్దతుతో ఓ దశలో లాభాల్లోకి వచ్చి మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. దీంతో వారాంతంలో సూచీలకు భారీ నష్టాలు తప్పాయి. నిఫ్టీ 25,500 దిగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 83,150.15 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,311.01) నష్టాల్లో ప్రారంభమైన సూచీ.. ఇంట్రాడేలో 82,670.95 వద్ద కనిష్ఠాన్ని తాకింది. మధ్యాహ్నం తర్వాత లాభాల్లోకి వచ్చిన సూచీ 83,390.11 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 94.73 పాయింట్ల నష్టంతో 83,216.28 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 17.40 పాయింట్ల నష్టంతో 25,492.30 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.65గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బ్లాక్‌డీల్ కారణంగా ఎయిర్‌టెల్ దాదాపు 4 శాతానికి పైగా నష్టపోయింది. ఎయిర్‌టెల్‌లోని తన 0.8 శాతం వాటాను సింగ్‌టెల్ విక్రయించడంతో భారతీ ఎయిర్‌టెల్ షేర్లు ఒత్తిడి ఎదుర్కొన్నాయి. టెక్ మహీంద్రా, ట్రెంట్, రిలయన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4004 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.







## ఆర్‌బీఐ చర్యలతోనే 100 బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి ఎస్‌బీఐ : గవర్నర్

**ముంబయి:** ఒకప్పుడు నష్టాల్లో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నేడు 100 బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి చేరిందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. 2018లో నష్టాల్లో ఉన్న ఎస్‌బీఐ రిజర్వ్ బ్యాంక్ చేపట్టిన పలు సంస్కరణల కారణంగానే ఈ స్థాయికి చేరిందన్నారు. ఈ మేరకు ముంబయిలో ఎస్‌బీఐ బ్యాంకింగ్, ఎనకమిక్స్ కాన్‌క్లేవ్ 2025లో ఆయన మాట్లాడారు. ఆర్‌బీఐ రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్, కీలక విధానపరమైన నిర్ణయాలే దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేశాయని మల్హోత్రా అన్నారు. ఆర్‌బీఐ తీసుకున్న చర్యలతో రుణ గ్రహీతల్లో క్రమశిక్షణ అలవడడంతో పాటు బ్యాంకుల ఆస్తుల నాణ్యత మెరుగైందన్నారు. ముఖ్యంగా దివాలా చట్టం-2016, కోర్టు వెలుపలి పరిష్కార మార్గాలు వంటివి రుణవిధానాల్లో కీలక మార్పునకు నాంది పలికాయన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థలు తీవ్ర ఒత్తిడిలో ఉన్నప్పుడు సంక్షోభాన్నే అవకాశంగా మలుచుకుని 2014 నుంచి ఆర్‌బీఐ అనేక చర్యలు చేపట్టిందని మల్హోత్రా అన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతానికి దీర్ఘకాలిక చర్యలు చేపట్టినట్లు వివరించారు. దీనికితోడు 27గా ఉన్న పబ్లిక్ సెక్టార్ బ్యాంకులను 2020 నాటికి 12కి తగ్గించడం, బ్యాంకులకు పెద్ద మొత్తంలో మూలధనం సాయం, బ్యాలెన్స్ షీట్లను బలోపేతం చేయడం, ఆరోగ్యకర రుణ వాతావరణం కల్పించడం వంటివీ బ్యాంకింగ్ వ్యవస్థ బలోపేతానికి దోహదం చేశాయన్నారు.



### టీమ్ ఇండియా మహిళా జట్టు ప్లేయర్
## ప్రతీక రావల్‌కు విన్నర్ మెడల్


టీమ్‌ఇండియా మహిళా జట్టు ఓపెనర్ ప్రతీక రావల్.. తాను ఐసీసీ ఛైర్మన్ జైషా చొరవతో మహిళల వన్డే వరల్డ్ కప్ విన్నర్ మెడల్‌ను పొందినట్లు సీఎన్ఎన్ న్యూస్18కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. నిజానికి ఆమె గాయం కారణంగా సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లకు దూరమైంది. ఆ స్థానంలో ఆఖర్లో జట్టులోకి వచ్చిన షెఫాలీ వర్మ ఆడింది. ప్రతీక బంగ్లాదేశ్‌తో జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తూ గాయానికి గురైన విషయం తెలిసిందే. దీంతో ఆమె టోర్నీకి దూరమైంది. భారత జట్టు సౌతాఫ్రికాతో జరిగిన ఫైనల్‌లో 52 పరుగులతో విజయం సాధించింది. జట్టులోని 15 మంది సభ్యులు ఐసీసీ మెడల్స్ పొందారు. అయితే ప్రతీక మొదట మెడల్‌ను దక్కించుకోలేకపోయారు. 'ప్రతీకకు పతకం రావడం కోసం ఏర్పాట్లు చేస్తున్నామని జైషా మా మేనేజర్‌కు మెసేజ్ పంపారు. దీంతో నేను చాలా ఆనందపడ్డా. అయితే నా మెడల్ రావడానికి ఇంకాస్త సమయం పడుతుంది. ప్రస్తుతానికి సపోర్టింగ్ స్టాఫ్‌కు ఇచ్చిన మెడల్‌ను నాకు అందించారు అని ప్రతీక చెప్పారు.




## హాంకాంగ్ సూపర్ సిక్సెస్..
### పాక్‌పై భారత్ విజయం

హాంకాంగ్ సూపర్ సిక్సెస్‌లో భాగంగా ఇండియా, పాక్ తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ విధానంలో టీమ్‌ఇండియా 2 పరుగుల తేడాతో పాక్‌పై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు నిర్ణీత 6 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 86 పరుగులు చేసింది. రాబిన్ ఉతప్ప (28, 11 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), భరత్ చిప్లి (24, 13 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. స్టువర్ట్ బిన్నీ (4), అభిమన్యు మిథున్ (6) పరుగులు చేశారు. దినేశ్ కార్తిక్ (17, 6 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) నాటౌట్‌గా నిలిచాడు. పాక్ బౌలర్లలో మహ్మద్ షెహజాద్ 2, అబ్దుల్ సమద్ 1 వికెట్ తీసుకున్నారు. అనంతరం 87 పరుగుల విజయలక్ష్యంతో పాకిస్థాన్ బ్యాటింగ్‌కు దిగింది. మూడు ఓవర్ల తర్వాత వరుణుడు ఆటకు అంతరాయం కలిగించాడు. ఆ సమయానికి పాక్ 1 వికెట్ కోల్పోయి 41 పరుగులు చేసింది. తిరిగి ఆట కొనసాగే పరిస్థితి లేకపోవడంతో డక్‌వర్త్‌లూయిస్ విధానంలో టీమ్‌ఇండియా 2 పరుగుల తేడాతో విజయం సాధించింది. వర్షం వల్ల మ్యాచ్ ఆగే సమయానికి ఖవాజా నఫే (18, 9 బంతుల్లో, 1 ఫోర్, 2 సిక్స్‌లు), అబ్దుల్ సమద్ (16, 6 బంతుల్లో, 2 ఫోర్లు, 1 సిక్స్) క్రీజులో ఉన్నారు. మాజ్ సదఖత్ 7 పరుగులకు పెవిలియన్‌కు చేరాడు. భారత బౌలర్లలో స్టువర్ట్ బిన్నీ ఒక వికెట్ తీసుకున్నాడు.

## గిల్ హిట్టింగ్ కన్నా.. టైమింగ్ మీద దృష్టి పెడుతున్నాడు




ఆస్ట్రేలియాతో గురువారం జరిగిన నాలుగో టీ20లో టీమ్‌ఇండియా 48 పరుగుల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో శుభ్‌మన్ గిల్ 46 పరుగులతో భారత జట్టులో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అతడు ఇందుకోసం 39 బంతుల్ని ఎదుర్కొన్నాడు. ఈ నేపథ్యంలో అతడి స్ట్రైక్‌రేట్‌పై విమర్శలు వస్తున్నాయి. అయితే గిల్‌కు టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్లు ఇర్ఫాన్ పఠాన్, వరుణ్ అరోన్ మద్దతుగా నిలిచారు. 'శుభ్‌మన్ గిల్ నిర్లక్ష్యపూరిత షాట్లు ఆడటం లేదు. హిట్టింగ్ కంటే కూడా.. తన టైమింగ్ మీద ఎక్కువగా దృష్టి పెడుతున్నాడు. ఇలా ఆడే అతడు బౌండరీలు సాధించాలనుకుంటున్నాడు. అది అతడి స్టైల్. గిల్ ఒత్తిడిలోనూ చక్కగా బ్యాటింగ్ చేశాడు. తర్వాత వచ్చిన సూర్యకుమార్ యాదవ్ పెద్ద షాట్లు ఆడాడు. ఓ రెండు సిక్స్‌లు బాదాడు. మంచి స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేశాడు. అలాగే గిల్‌కు సొంత పద్ధతి, స్టైల్ ఉన్నాయి' అని ఇర్ఫాన్ పఠాన్ అన్నాడు. 'అద్భుతమైన టెక్నిక్.. శుభ్‌మన్ గిల్ సొంతం. పిచ్‌పై అతడికి పూర్తి అవగాహన ఉంది. అందుకే పరిస్థితికి అనుగుణంగా ఆడతాడు. ఈ కారణంగానే.. టీ20 జట్టులో శుభ్‌మన్ గిల్ తప్పకుండా ఉండాలి. అయితే పొట్టి ఫార్మాట్లో అతడి స్థానాన్ని కొందరు ప్రశ్నిస్తున్నారు. కానీ అది ఏమాత్రం సరికాదు. జట్టులోని ఇతర బ్యాటర్లందరూ విఫలమైన కఠినమైన పిచ్ మీద కూడా గిల్ అద్భుతంగా ఆడాడు. ఎంతో విలువైన 46 పరుగులు చేశాడు' అని వరుణ్ అరోన్ విశ్లేషించాడు.

# బుమ్రా కంటే.. వారిద్దరే ప్రమాదకరం

**వరుణ్, అభిషేక్‌ను హ్యాండిల్ చేయడం నేర్చుకుంటేనే ప్రత్యర్థి జట్లు విజయం**

### రవిచంద్రన్ అశ్విన్




టీ20 ఫార్మాట్‌లో ప్రత్యర్థులకు బుమ్రా కన్నా.. వరుణ్ చక్రవర్తి, అభిషేక్ శర్మతోనే ఎక్కువ ప్రమాదమని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు. అయితే బుమ్రా 2016 నుంచి అన్ని ఫార్మాట్లలో టీమ్‌ఇండియాకు కీలక బౌలర్‌గా ఉన్నాడు. అలాగే టీ20 వరల్డ్‌కప్ 2024లో అతడు 15 వికెట్లు తన ఖాతాలో వేసుకుని, ప్లేయర్ ఆఫ్‌ది టోర్నమెంట్‌గానూ నిలిచిన విషయం తెలిసిందే. అయినప్పటికీ అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్ వేదికగా పై విధంగా స్పందించాడు. 'భారత్‌లో జరగనున్న టీ20 వరల్డ్ కప్‌ను ఏ జట్టైనా గెలవాలనుకుంటే.. వారు ప్రధానంగా రెండు అడ్డంకులను అధిగమించాలి. ఇంతకాలం నేను బుమ్రా గురించి చెబుతూ వచ్చాను. కానీ, అతడి కన్నా.. వరుణ్ చక్రవర్తి, అభిషేక్ శర్మ రూపంలోనే ప్రమాదం పొంచి ఉంది. ప్రస్తుత సిరీస్‌లో టిమ్ డేవిడ్.. వరుణ్ చక్రవర్తిని ఎదుర్కొన్న విధానం చూసిన తర్వాత నా అభిప్రాయానికి మరింత బలం చేకూరింది. వరుణ్, అభిషేక్‌ను హ్యాండిల్ చేయడం నేర్చుకుంటేనే ప్రత్యర్థి జట్లు విజయం సాధించగలవు' అని అతడు విశ్లేషించాడు. అలాగే ఆస్ట్రేలియా అభిషేక్‌పై సంధిస్తున్న షార్ట్ బాల్ వ్యూహం గురించి కూడా అశ్విన్ మాట్లాడాడు. 'ప్రస్తుత టీ20 సిరీస్‌లో ఆసీస్ జట్టు అభిషేక్‌పై షార్ట్‌బాల్ వ్యూహం అనుసరిస్తున్నారు. వరల్డ్‌కప్‌లోనూ వారు ఇదే ప్రణాళికతో ముందుకు వెళతారు. అలాగే వరుణ్ చక్రవర్తి విషయంలో ఇలాంటి వ్యూహంతోనే వారు సిద్ధమవుతారు' అని అశ్విన్ అన్నాడు. గురువారం జరిగిన నాలుగో టీ20లో టీమ్‌ఇండియా 48 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో అయిదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ 2-1 ఆధిక్యంలో ఉంది. చివరి మ్యాచ్ బ్రిస్బేన్‌లో శనివారం జరగనుంది.

## షమీ మళ్లీ జట్టులోకి వచ్చే అవకాశముంది


### మాజీ క్రికెటర్ ఆకాశ్‌చోప్రా




మహ్మద్ షమీ కొంతకాలంగా జాతీయ జట్టుకు సెలెక్ట్ కావడం లేదు. త్వరలో స్వదేశంలో జరగనున్న దక్షిణాఫ్రికా సిరీస్‌కు ఎంపిక చేసిన స్క్వాడ్‌లో కూడా అతడు చోటు దక్కించుకోలేకపోయాడు. అదే సమయంలో షమీ రంజీల్లో మాత్రం అద్భుత ప్రదర్శన చేస్తున్నాడు. అలాగే తన ఫిట్‌నెస్‌పై వస్తున్న ఆరోపణలకు చెక్ పెట్టాడు. తాను మరోసారి టీమ్‌ఇండియా జెర్సీ ధరిస్తానని ఆశాభావమూ వ్యక్తం చేశాడు. అయితే అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ మాత్రం షమీకి మొండిచేయి చూపెడుతోంది. ఈ నేపథ్యంలో షమీ అంతర్జాతీయ కెరీర్ ముగిసినట్లేనని సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరగనున్న సిరీస్‌కు కూడా అతడు ఎంపిక కాకపోవడంతో వీటికి మరింత బలం చేకూరుతోంది. అయితే షమీకి తప్పకుండా మరో అవకాశం వస్తుందని, అతడు తిరిగి జాతీయ జట్టులోకి వస్తాడని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ ఆకాశ్‌చోప్రా ఆశాభావం వ్యక్తంచేశాడు. 'షమీ మళ్లీ జాతీయజట్టులోకి రాడని సోషల్‌మీడియాలో వార్తలు వస్తున్నాయి. కానీ అవి వాస్తవం కాదు. సెలక్షన్ కమిటీ అలా అని ఎప్పుడూ చెప్పలేదు. అతడు మరో అవకాశం తప్పకుండా పొందుతాడు. దేశవాళీల్లో అతడు ఇలానే వికెట్లు తీస్తే తిరిగి కచ్చితంగా జాతీయజట్టులోకి వస్తాడు' అని ఆకాశ్ చోప్రా అన్నాడు. 'ఫాస్ట్ బౌలర్ల అవసరం టీమ్‌ఇండియాకు ఎంతో ఉంది. గాయాల బెడద, వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ నేపథ్యంలో షమీకి తప్పకుండా అవకాశం లభిస్తుంది. రానున్న రోజుల్లో ఇంకా చాలా మ్యాచ్‌లు జరగనున్నాయి. షమీ ఎంపిక విషయంలో ఆందోళన పడాల్సిన అవసరం లేదు. అతడు తప్పకుండా పునరాగమనం చేస్తాడు' అని ఆకాశ్ చోప్రా విశ్లేషించాడు.

## ఆ మాజీ సెలక్టర్ లైంగికంగా వేధించాడు

### బంగ్లా పేసర్ జహనారా ఆలమ్



బంగ్లాదేశ్ మహిళల క్రికెట్ జట్టు పేసర్ జహనారా ఆలమ్ సంచలన ఆరోపణలు చేశారు. 2022 మహిళల వన్డే ప్రపంచకప్ సందర్భంగా మాజీ సెలెక్టర్ మంజురుల్ ఇస్లాం.. లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని విమర్శించారు. ప్రస్తుతం జహనారా బంగ్లా జట్టుకు దూరంగా ఉంది. మంజురుల్ ఇస్లాం ప్రతిపాదనను అంగీకరించకపోవడంతో తన కెరీర్‌కు నష్టం కలిగిందని ఆమె వాపోయారు. 'నేను ఒకసారి కాదు. చాలాసార్లు అసభ్యకరమైన ప్రతిపాదనలు ఎదుర్కొన్నా. మేం జట్టులో ఉన్నప్పుడు చాలా విషయాల గురించి మాట్లాడలేం. నిరసన కూడా తెలియజేయలేం. బంగ్లాదేశ్ బోర్డులోని చాలా మంది సీనియర్ అధికారుల మద్దతు కోరడానికి ప్రయత్నించాను. మహిళా కమిటీ ఛైర్‌పర్సన్ నాదెల్ చౌదరి, బీసీబీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ నిజాముద్దీన్ చౌదరి దృష్టికి కూడా తీసుకెళ్లా' అని జహనారా ఆలమ్.. ఓ యూట్యూబ్ ఛానల్ వేదికగా ఆరోపించారు. '2021లో తోహిద్ భాయ్.. బాబు భాయ్ (కోఆర్డినేటర్ సర్ఫరాజ్ బాబు) ద్వారా నన్ను సంప్రదించాడు. వారు నాతో ఎందుకు తప్పుగా ప్రవర్తించారో నాకు అర్థం కాలేదు. నేను నిశ్శబ్దంగా ఉండి క్రికెట్‌పై దృష్టిపెట్టడానికి చాలా ప్రయత్నించాను. కానీ నేను ఆ ప్రతిపాదనను వ్యూహాత్మకంగా తప్పించుకున్నప్పుడు, మంజుభాయ్ మరుసటి రోజు నుంచే నన్ను అవమానించడం ప్రారంభించారు' అని ఆమె అన్నారు. 'రెండో ప్రతిపాదన 2022 ప్రపంచకప్ సమయంలో మంజు భాయ్ నుంచి వచ్చింది. దీంతో గత ఏడాదిన్నరలో జరిగిన ప్రతి దాని గురించి నేను బీసీబీకి తెలియజేయాలని నిర్ణయించుకున్నాను. నేను నాదెల్‌కు చాలాసార్లు ఈ విషయాలు చెప్పాను. అయితే వారు తాత్కాలిక పరిష్కారాన్ని చూపేవారు. కానీ త్వరలోనే పరిస్థితులు మళ్లీ యథాస్థితికి వచ్చేవి. నేను సీఈఓకు కూడా విషయం తెలియజేశాను' అని జహనారా వివరించారు. 'మా ప్రీ-క్యాంప్ సమయంలో.. నేను బౌలింగ్ చేస్తున్నప్పుడు.. మంజురుల్ ఇస్లామ్ అసభ్యకరంగా తాకాడు. ఇతర మహిళా క్రికెటర్లతోను అతడు ఇలాగే వ్యవహరించేవాడు. షేక్‌హ్యాండ్ సమయంలోనూ అనుచితంగా ప్రవర్తించేవాడు. అలాగే నెలసరి గురించి కూడా అతడు ఇబ్బందికరంగా నన్ను అడిగాడు' అని ఆమె వెల్లడించారు. అయితే ఈ ఆరోపణలను మంజురుల్ ఇస్లాం ఖండించాడు. అవన్నీ నిరాధారమైనవని తోసిపుచ్చాడు. జహనారా ఆలమ్ ఆరోపణలపై బీసీబీ స్పందించింది. 'ఆరోపణలు చాలా తీవ్రమైనవి. అవసరమైతే.. మేం కచ్చితంగా ఈ విషయమై దర్యాప్తు చేస్తాం' అని బీసీబీ వైస్ ఛైర్మన్ షఖావత్ హుస్సేన్ అన్నారు.




## ఏఐ సాయంతో స్కామ్స్..
### ఉద్యోగార్థులకు గూగుల్ హెచ్చరిక

టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో సైబర్ మోసగాళ్లు కూడా కొత్త కొత్త మార్గాల్లో ప్రజలను దోచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గూగుల్ తాజాగా ఓ హెచ్చరికను జారీ చేసింది. జెనరేటివ్ ఏఐ సాయంతో సృష్టిస్తున్న నకిలీ ఉద్యోగ ప్రకటనలు, వ్యాపార వెబ్‌సైట్లు, యాప్‌లు వేగంగా విస్తరిస్తున్నాయని తెలిపింది. అదే విధంగా పండగ సీజన్ షాపింగ్, ఇయర్-ఎండ్ జాబ్ సెర్చ్ సమయాల్లో మోసాలు మరింత పెరిగే అవకాశముందని హెచ్చరించింది. మోసగాళ్లు ప్రస్తుతం ఏఐ సాంకేతికతను వినియోగిస్తూ అధికారిక కంపెనీ బ్రాండింగ్‌ను అనుకరిస్తూ నకిలీ ఉద్యోగ ప్రకటనలు, అప్లికేషన్లు, వెబ్‌సైట్లు తయారు చేస్తున్నారని గూగుల్ ట్రస్ట్ సేఫ్టీ బృందం తెలిపింది. ఇవి అచ్చం నిజమైన ప్రకటనలుగా కనిపించడంతో ఉద్యోగార్థులు, చిన్న వ్యాపార యజమానులు సులభంగా మోసపోతున్నారని పేర్కొంది. అధికారిక సంస్థల పేర్లతో నకిలీ రిక్రూటర్లు.. అభ్యర్థుల వ్యక్తిగత వివరాలు సేకరించడం, ప్రాసెసింగ్ ఫీజు పేరుతో డబ్బులు అడగడం వంటి ఘటనలు పెరుగుతున్నాయని గూగుల్ తెలిపింది. కొందరు మోసగాళ్లు 'ఇంటర్వ్యూ సాఫ్ట్‌వేర్' పేరిట మోసపూరిత ఫైళ్లను పంపించి, వ్యక్తిగత సమాచారాన్ని దోచుకుంటున్నారని వెల్లడించింది. నిజమైన సంస్థలు ఉద్యోగ ప్రక్రియలో ఎప్పుడూ డబ్బులు, బ్యాంక్ వివరాలు అడగవని గూగుల్ గుర్తుచేసింది.

### వ్యాపారులూ బహు పరాక్

అలాగే, వ్యాపార సంస్థలను లక్ష్యంగా చేసుకుని 'రివ్యూ ఎక్స్‌టార్షన్'కు పాల్పడుతున్నారని గూగుల్ పేర్కొంది. మోసగాళ్లు వ్యాపార పేజీలకు పెద్దఎత్తున సింగిల్ స్టార్ రివ్యూ ఇచ్చి వాటి ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారు. ఆ రివ్యూలను తొలగించాలంటే నగదు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపింది. ఇలాంటి ఎక్స్‌టార్షన్‌ను నేరుగా బిజినెస్ ప్రొఫైల్ నుంచే రిపోర్ట్ చేసే సౌకర్యాన్ని అందుబాటులోకి గూగుల్ తీసుకొచ్చింది. అదే విధంగా ఏఐ పేరుతో నకిలీ యాప్‌లు, వెబ్‌సైట్లు సృష్టించడం ఏఐ వినియోగించి 'ఫ్రీ యాక్సెస్' లేదా 'ఎక్స్‌క్లూజివ్ వెర్షన్' అంటూ వినియోగదారులను ఆకర్షించి, మోసపూరిత సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేయించడం, ఖాతా వివరాలు దోచుకోవడం వంటివీ తమ దృష్టికొచ్చిందని పేర్కొంది. కొన్ని వీపీఎన్ యాప్‌ల్లో మాల్వేర్ దాగి ఉంటుందని హెచ్చరించింది. ఈ విధమైన స్కామ్‌లను నివారించడానికి గూగుల్ తనవంతుగా సేఫ్ బ్రౌజింగ్‌లో ఏఐ ఆధారిత ప్రొటెక్షన్‌లు, ప్లే స్టోర్‌లో కఠినమైన విధానాలు అమలు చేస్తోందని తెలిపింది. జీమెయిల్, గూగుల్ మెసేజ్‌ల్లో రియల్ టైమ్ స్కామ్ డిటెక్షన్ ఫీచర్లను అందిస్తోందని తెలిపింది.

## మస్క్ ప్యాకేజీ పాక్ జీడీపీ కంటే 3 రెట్లు ఎక్కువ..

ప్రపంచంలో అత్యంత సంపన్నుల జాబితాలో తొలి స్థానంలో ఉన్న ఎలాన్ మస్క్‌కు ట్రిలియన్ డాలర్ల వేతన ప్యాకేజీ ఇచ్చేందుకు టెస్లా కంపెనీ వాటాదారులు అంగీకరించారు. ఆ సంస్థకు సీఈవోగా ఉన్న ఆయనకు ఈ ప్యాకేజీ ఇచ్చేందుకు 75 శాతం మందికి పైగా షేర్ హోల్డర్స్ అంగీకరించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే వచ్చే పదేళ్లలో టెస్లా అనుకున్న లక్ష్యాలను చేరితే ఈ ప్యాకేజీ అందుతుందని షరతు విధించినట్లు వెల్లడించాయి. ఆ ప్యాకేజీ విలువ భారత కరెన్సీలో అక్షరాలా రూ. 88లక్షల కోట్లు. ఇది పాకిస్థాన్ జీడీపీ కంటే మూడు రెట్లు ఎక్కువ కావడం గమనార్హం. 2024 నాటికి పాక్ జీడీపీ విలువ 373 బిలియన్ డాలర్లు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దిగ్గజ కార్పొరేట్ సంస్థల సీఈవో ప్యాకేజీలతో పోలిస్తే మస్క్ ప్యాకేజీ ఎన్నో రెట్లు ఎక్కువ.

- మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల - 79.1 మిలియన్ డాలర్లు
- యాపిల్ సీఈవో టిమ్ కుక్ - 74.6 మిలియన్ డాలర్లు
- ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్ - 49.9 మిలియన్ డాలర్లు
- ఎలీ లిల్లీ సీఈవో డేవిడ్ రిక్స్ - 29.2 మిలియన్ డాలర్లు
- మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ - 27.2 మిలియన్ డాలర్లు
- వీసా సీఈవో ర్యాన్ మెక్‌ఇనెర్నీ - 26 మిలియన్ డాలర్లు
- ఆల్ఫాబెట్ సీఈవో సుందర్ పిచాయ్ - 10.7 మిలియన్ డాలర్లు
- బ్రాడ్‌కామ్ సీఈఓ హాక్‌టాన్ - 2.6 మిలియన్ డాలర్లు
- అమెజాన్ సీఈవో ఆండీ జస్సీ - 1.6 మిలియన్ డాలర్లు
- బెర్క్‌షైర్ హాథ్‌వే సీఈవో వారెన్ బఫెట్ - 4 లక్షల డాలర్లు.

www.rajamudranews.com
రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



# వింటేజ్ స్టైల్లో ప్రభాస్




పాన్ ఇండియా హీరో ప్రభాస్ నటిస్తున్న రాజాసాబ్ సినిమా కోసం రెబల్ స్టార్ అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. దర్శకుడు మారుతి రూపొందిస్తున్న ఈ హార్రర్ ఎంటర్టైనర్‌లో ప్రభాస్ వింటేజ్ స్టైల్లో కనిపించనున్నాడని ఇప్పటికే ఊహాగానాలు ఉన్నాయి. ఈ సినిమాను వచ్చే సంక్రాంతి కానుకగా జనవరి 9న విడుదల చేయాలని బృందం భావిస్తోంది. అయితే కొంతకాలంగా చిత్రానికి సంబంధించిన అప్డేట్స్ రాకపోవడంతో సినిమా మళ్లీ వాయిదా పడుతుందా అనే వార్తలు చక్కర్లు కొట్టాయి. కానీ మేకర్స్ వాటిని ఖండిస్తూ స్పష్టత ఇచ్చారు. సినిమా ఫస్ట్ కాపీ డిసెంబర్ 25 నాటికి రెడీ అవుతుందని, అలాగే అమెరికాలో గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుపుతున్నట్టు తెలిపారు. ఇప్పుడు అయితే వరుసగా అదిరిపోయే అప్డేట్స్ ఇవ్వడానికి టీమ్ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. మొదటగా,రాజాసాబ్ ఫస్ట్ సింగిల్ విడుదల కానుంది. తమన్ ఇప్పటికే ఒక మాస్ అండ్ మెలోడియస్ ట్రాక్‌ను కంపోజ్ చేసినట్టు తెలుస్తోంది. ఈ పాటను ఈ నెల మూడో వారంలో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. అలాగే,న్యూ ఇయర్ స్పెషల్ గిఫ్టా సినిమా ట్రైలర్ విడుదల చేయాలనే ఆలోచనలో మారుతి ఉన్నాడట. ఇందుకోసం ప్రత్యేకంగా ఇంపాక్ట్ కలిగించే పవర్‌ఫుల్ ట్రైలర్ కట్ సిద్ధం చేస్తున్నారు. ఈ ట్రైలర్‌తోనే సినిమా పై అంచనాలను మరింత ఉద్ధృతం చేయాలని టీమ్ భావిస్తోంది.క్రిస్మస్ సందర్భంగా అమెరికాలో ప్రీ రిలీజ్ ఈవెంట్, ఆపై జనవరి మొదటి వారంలో తెలుగురాష్ట్రాలలో భారీ స్థాయి ప్రీ రిలీజ్ కార్యక్రమం ప్లాన్ చేస్తుండగా, సినిమా మాత్రం చెప్పినట్టే జనవరి 9న వరల్డ్ వైడ్గా థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధంగా ఉంది.

## నా బరువు తెలుసుకొని మీరు ఏం చేస్తారు?

### రిపోర్టర్ ప్రశ్నపై మండిపడిన నటి

నటి గౌరీ కిషన్‌కు తాజాగా చేదు అనుభవం ఎదురైంది. తన సినిమా 'అదర్స్' ప్రచారంలో పాల్గొన్న ఆమెను ఓ రిపోర్టర్ ఇబ్బందికర ప్రశ్న అడిగారు. దీంతో ఆమె మొదట సహనంతో సమాధానమిచ్చారు. తర్వాత ఆ రిపోర్టర్ తన ప్రశ్నను సమర్థించుకోవడంతో గౌరీ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఆమె రిప్లైపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. తమిళంలో వరుస సినిమాలతో గౌరీ అలరిస్తున్నారు. తాజాగా ఆమె అబిన్ హరికరణ్ దర్శకత్వంలో నటించిన చిత్రం 'అదర్స్'. దీని ప్రచారంలో భాగంగా ఓ ప్రెస్‌మీట్ నిర్వహించారు. అందులో ఓ జర్నలిస్ట్ 'మీ బరువు ఎంత ఉంటుంది?' అని ఆమెను అడిగారు. తన ప్రశ్నను సమర్థించుకుంటూ గతంలో కొందరు స్టార్ హీరోయిన్లు కూడా ఇలాంటి ప్రశ్నలకు సమాధానం చెప్పారని అన్నారు. దీంతో గౌరీ ఘాటుగా స్పందించారు. "నా బరువు తెలుసుకొని మీరు ఏం చేస్తారు?, దానివల్ల మీకు ఏంటి ఇబ్బంది?, ఈ సినిమాకు నా వెయిట్ వల్ల ఏమైనా నష్టం ఉందా? ప్రతి మహిళకు భిన్నమైన శరీరాకృతి ఉంటుంది. నా ప్రతిభ గురించి మాట్లాడండి. నేను ఇప్పటివరకూ చేసిన పాత్రల గురించి, సినిమాల గురించి అడగండి. అవే నేనేంటో నిరూపిస్తాయి" అని చెప్పారు.




## ఏకే 64లో లారెన్స్, విజయ్ సేతుపతి

తమిళ స్టార్ హీరో అజిత్ కుమార్ నటిస్తున్న తాజా యాక్షన్ చిత్రం ఏకే 64 గురించి మరో కీలక అప్డేట్ బయటకు వచ్చింది. ఆదిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో రూపొందుతున్నఈ పాన్ ఇండియా భారీ ప్రాజెక్ట్ కోసం గణనీయమైన బడ్జెట్‌ను కేటాయించినట్టు తెలిసింది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో అజిత్‌తో పాటు మరో ఇద్దరు స్టార్ హీరోలు కూడా కీలక పాత్రల్లో నటించబోతున్నారు.వారు విజయ్ సేతుపతి,రాఘవ లారెన్స్. అయితే వీరిద్దరూ ప్రతినాయకులుగా నటిస్తున్నారా లేక అజిత్‌కు అండగా నిలిచే శక్తివంతమైన పాత్రల్లో వస్తారా అన్నది చిత్రయూనిట్ ఇంకా వెల్లడించలేదు. కానీ ఇండస్ట్రీ వర్గాల మాటల ప్రకారం, వీరి రోల్స్ మల్టీ-డైమెన్షనల్‌గా ఉండనున్నాయని, కేవలం ప్రతినాయక పాత్రలుగా మాత్రమే కాకుండా కథలో ప్రధాన మలుపులకు కారణమవుతారని సమా చారం.

## జటాధర.. శివ.. శివ!

**కథానాయకుడు సుధీర్‌బాబుకు సరైన హిట్టు పడి చాలా కాలమైపోయింది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు విజయమే లక్ష్యంగా 'జటాధర'తో అలరించేందుకు సిద్ధమయ్యారు. నిధులు.. పిశాచాలు.. దైవత్వం లాంటి అంశాలతో మిళితమై ఉన్న హారర్ చిత్రమిది. మరి ఇందులో సోనాక్షి సిన్హా ధన పిశాచిగా భయపెట్టిందా? సుధీర్‌బాబుకు విజయం దక్కిందా?**

రివ్యూ



శివ (సుధీర్‌బాబు) ఓ ఘోస్ట్ హంటర్. సైన్స్‌ని తప్ప దెయ్యాల్ని అస్సలు నమ్మడు. ఎక్కడైనా దెయ్యాలున్నాయని వినిపిస్తే చాలు.. వెంటనే అక్కడ వాలిపోయి వెళ్లి సైంటిఫిక్‌గా దెయ్యాలు లేవని నిరూపించి వస్తుంటాడు. ఓ బాబును తన తల్లి చంపుతున్నట్లు ఓ కల అతన్నెప్పుడూ వెంటాడుతుంటుంది. ఓసారి శివ మిత్రుడు ఒకరు రుద్రారం గ్రామంలో ఓ పాడుబడ్డ ఇంట్లో పరిశోధనకు వెళ్లి అనుమానాస్పద రీతిలో మృత్యువాత పడతాడు. ఆ ఇంట్లో లంకె బిందెలకు కాపలాగా ఉండే ధన పిశాచి (సోనాక్షి సిన్హా) అతన్ని బలి తీసుకుందని ప్రచారం వినిపించడంతో.. దాన్ని ఛేదించేందుకు శివ ఆ ఊళ్లోకి అడుగు పెడతాడు. మరి తర్వాత ఏమైంది? అసలు ఆ ఇంట్లో ఉన్న ధన పిశాచి నేపథ్యమేంటి? దానికీ, శివకూ ఉన్న విరోధం ఏంటి? లంకె బిందెలు దక్కించుకోవాలని ఆశ పడ్డ శివ మేనత్త శోభ (శిల్పా శిరోద్కర్) కథేంటి? అన్నది సినిమా.

### ఎలా సాగిందంటే..

నిధులు.. దానికి రక్షణగా ఉండే పిశాచి బంధాల నేపథ్యాలతో ఉత్తరాదిలోనూ.. దక్షిణాదిలోనూ బోలెడన్ని చిత్రాలొచ్చాయి. ఈ 'జటాధర' కూడా ఆ కోవకు చెందిన చిత్రమే. ఇది ప్రధానంగా ధన పిశాచి బంధనం నేపథ్యంతో సాగుతుంది. నిజానికి ఈతరహా కథల్ని ఎన్నిసార్లు చూసినా.. వాటిని తెరపై ఆవిష్కరించే తీరు ఆసక్తిరేకెత్తించేలా ఉండి.. ప్రేక్షకుల్ని కాస్త భయపెట్టి, థ్రిల్ పంచగలిగాయంటే చాలు.. బాక్సాఫీస్ బరిలో కాసుల వర్షం కురిపించేస్తాయి. కాకపోతే ఈ మ్యాజిక్ 'జటాధర'లో పూర్తిగా మిస్సయ్యింది. పూర్వం నిధుల్ని భూమిలో ఎందుకు దాచి పెట్టేవారు? దానికి రక్షణగా ధన పిశాచి బంధనాన్ని ఎందుకు వేసేవారో వివరిస్తూ కథను మొదలు పెట్టి నేరుగా లంకె బిందెల ఎపిసోడ్‌ను తెరపైకి తీసుకొచ్చాడు దర్శకుడు. కానీ, ఘోస్ట్ హంటర్‌గా హీరో పాత్ర తెరపైకి వచ్చినప్పటి నుంచి కథ, కథనాలు ముందుకు సాగవు. దీనికి తోడు హీరో-హీరోయిన్ల లవ్‌ట్రాక్ ఓ స్పీడ్ బ్రేకర్. హీరో రుద్రారంలో అడుగు పెట్టడంతోనే అసలు కథ మొదలవుతుంది. ఈక్రమంలో వచ్చే విరామ సన్నివేశాలు మరీ థ్రిల్ పంచకున్నా ఫర్వాలేదనిపిస్తాయి.

రుద్రారం గ్రామంలోని పాడుబడ్డ ఇంటికి శివకు ఉన్న సంబంధం ఏంటి? బాల్యంలో తన కుటుంబానికి జరిగిన అన్యాయమేంటి? ధన పిశాచి తనని ఎందుకు బలి తీసుకోవాలనుకుంటోంది? దాన్ని అడ్డుకునేందుకు తనేం చేశాడు? అనే అంశాలతో ద్వితీయార్ధం సాగుతుంది. సాధారణంగా ఇలాంటి కథల్లో హీరోకు బలమైన ఫ్లాష్‌బ్యాక్ ఉండాలి. లేదంటే ధన పిశాచి నేపథ్యమైనా భయపెట్టేలా ఉండాలి. 'జటాధర' అది మిస్సయింది. ధన పిశాచిగా సోనాక్షి.. గోల్డ్ షాప్‌కి ప్రచారం చేస్తున్న మోడల్‌లా ఒంటి నిండా నగలతో అప్పుడప్పుడు అతిథిలా అలా మెరిసి మాయమవుతుంటుందే తప్ప ఆ పాత్ర ప్రభావం.. దాని వల్ల పుట్టే భయం కథలో పెద్దగా కనిపించదు. అసలు ధన పిశాచి శక్తి సామర్థ్యాలేంటి? దాని వల్ల హీరోకి ఎంత కఠినమైన సవాళ్లు ఎదురయ్యాయి? అన్నది ఇంకాస్త బలంగా చూపించాల్సింది. ప్రీక్లైమాక్స్‌లో హీరోకి.. ధన పిశాచికీ మధ్య జరిగే వార్ సీక్వెన్స్ కూడా సాగదీత వ్యవహారం. ఒక రొటీన్ క్లైమాక్స్‌తో ఈ కథను మమ అనిపించి, రెండో భాగానికి బాటలు వేశారు.

### ఎవరెలా చేశారంటే..

ఘోస్ట్ హంటర్‌గా సుధీర్‌బాబు ఆద్యంతం సీరియస్ లుక్‌లో సెటిల్డ్‌గా నటించారు. ఎప్పటిలాగే క్లైమాక్స్‌లో సిక్స్ ప్యాక్‌లుక్ ప్రదర్శించి.. ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ఆఖరిలో శివతాండవంతో మెప్పించారు. ప్రతినాయక ఛాయలున్న పాత్రలో శిల్పా శిరోద్కర్ ఆకట్టుకుంటుంది. ధన పిశాచిగా సోనాక్షి గ్లామర్‌గా కనిపించడం మినహా కథపై ఏ ప్రభావం చూపించలేదు. తన పాత్రకు పెద్దగా డైలాగులు కూడా లేవు. దర్శకుడు రాసుకున్న కథలో బలం లేదు. సినిమా ఆద్యంతం ఊహలకు అందేలాగే ఉంటుంది. అరుణాచలం గుడి.. దాని ప్రాముఖ్యత నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి.

## పవన్ కళ్యాణ్‌తో బ్రో 2..

### పవన్ కళ్యాణ్ గ్రీన్ సిగ్నలే తరువాయి



పవన్ కళ్యాణ్, సాయి దుర్గ తేజ్ నటించిన బ్రో సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయం సాధించలేదు. అయినప్పటికీ, దర్శకుడు సముద్రఖని బ్రో 2 తీయడానికి సిద్ధంగా ఉన్నానని, పవన్ కళ్యాణ్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే సినిమా పట్టాలెక్కుతుందని ప్రకటించారు. ఈ వార్త పవన్ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఓజీ 2 వంటి భారీ ప్రాజెక్టులున్న నేపథ్యంలో బ్రో 2 అవసరమా అని చర్చలు మొదలయ్యాయి.పవన్ కళ్యాణ్, సాయి దుర్గ తేజ్ కాంబినేషన్‌లో వచ్చిన ఫాంటసీ కామెడీ సినిమా బ్రో. ఇది మామా అల్లుళ్లు కలిసి నటించిన ఫస్ట్ మూవీ. వినోదయ సితం అనే తమిళ సినిమాకి ఇది రీమేక్. మాతృకను డైరెక్ట్ చేసిన సముద్రఖని.. కొన్ని మార్పుల చేర్పులతో తెలుగులో తెరకెక్కించారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ దీనికి స్క్రీన్ ప్లే అందించారు. 2023 జులై నెలాఖరున రిలీజైన ఈ సినిమా.. బాక్సాఫీస్ దగ్గర నిరాశ పరిచింది. పవర్ స్టార్ అభిమానులకు కూడా ఈ సినిమా నచ్చలేదు. అందుకే కలెక్షన్స్ రాలేదు. అయితే అలాంటి చిత్రానికి సీక్వెల్ చేయడానికి స్క్రిప్ట్ రెడీ అయింది.అవును.. మీరు విన్నది నిజమే. బ్రో 2 సినిమా చేయడానికి డైరెక్టర్ కమ్ యాక్టర్ సముద్రఖని సిద్ధంగా ఉన్నారు. తమిళంలో తీస్తారో లేదో తెలియదు కానీ.. తెలుగులో మాత్రం పవన్ కళ్యాణ్ తోనే ఈ సీక్వెల్ తీయాలని ఫిక్స్ అయిపోయారు. దీనికి కథ కూడా సిద్ధంగానే ఉంది. పవన్ ఎప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇస్తే, అప్పుడు సినిమాని పట్టాలెక్కించాలని చూస్తున్నారు. ఈ విషయాన్ని సముద్రఖని స్వయంగా మీడియా ముఖంగా వెల్లడించారు. బ్రో మూవీకి సీక్వెల్ ఉంటుందని కన్ఫామ్ చేశారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే, సముద్రఖని, రానా దగ్గుబాటి ప్రధాన పాత్రలు పోషించిన కాంత సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ప్రమోషన్స్‌లో భాగంగా గురువారం హైదరాబాద్ లో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. దీనికి దుల్కర్, రానా, భాగ్యశ్రీలతో పాటు సముద్రఖని కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్రో 2 మూవీ ప్రస్తావన వచ్చింది. దీనిపై సముద్రఖని స్పందిస్తూ.. బ్రో 2 స్క్రిప్ట్ రెడీగా ఉంది. అన్నగారు సిగ్నల్ ఇస్తే టేకాఫ్ అవుతుంది అని అన్నారు.బ్రో 2 సినిమా స్క్రిప్ట్ రెడీ అని సముద్రఖని ప్రకటించడంతో పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అంతా ఒక్కసారిగా సర్‌ప్రైజ్ అయ్యారు. ఒకింత షాక్ అయ్యారని చెప్పాలి. ఎందుకంటే ఇది వారు ఊహించని అప్డేట్. బ్రో కమర్షియల్ గా పెద్దగా వర్కౌట్ కాలేదన్నది ఓపెన్ సీక్రెట్. ఏదో పవర్ స్టార్ ఇమేజ్, స్టార్ డమ్ కారణంగా మంచి ఓపెనింగ్స్ వచ్చాయి. కానీ కంటెంట్ పరంగా చూసుకుంటే మాత్రం సాధారణ ప్రేక్షకులతో పాటుగా అభిమానులని కూడా అంతగా మెప్పించలేకపోయింది.

## అనసూయ త్రీసమ్ రొమాంటిక్ సాంగ్!

ఒక్కసారిగా అనసూయ మళ్ళీ హాట్ టాపిక్ అయింది. అందుకు ప్రధాన కారణం ఓ వీడియో సాంగ్. ప్రభుదేవా, రాయ్ లక్ష్మీ, అనసూయ భరద్వాజ్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం వోల్ఫ్ మళ్లీ వార్తల్లో నిలిచింది. 2023 ఆగస్టులో టీజర్‌ను విడుదల చేసిన ఈ చిత్ర బృందం, ఇన్నాళ్ల విరామం తర్వాత తాజాగా ఓ కొత్త అప్డేట్ ఇచ్చింది. తాజాగా విడుదలైన సాసా సాసా అనే తమిళ లిరికల్ వీడియో సాంగ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.ఈ పాటలో ప్రభుదేవా తన సొగసైన డ్యాన్స్ మూవ్స్‌తో ఆకట్టుకుంటూ కనిపిస్తారు. ఓ ఇంట్లో ఒంటరిగా ఉన్న హీరో జీవితంలో ముగ్గురు అందమైన యువతులు ఒక్కొక్కరిగా ప్రవేశించడం, వారంతా చాటుగా మొబైల్‌లో వీడియోలు తీయడం, హీరోను ఆటపట్టించడం వంటి రొమాంటిక్ సన్నివేశాల మధ్య ఈ పాట సాగుతుంది. మెలోడీకి తోడు స్టైలిష్ విజువల్స్, ప్రభుదేవా ఎనర్జిటిక్ డ్యాన్స్ ఫ్యాన్స్‌కి స్పెషల్ ట్రీట్‌గా మారాయి. ఇప్పటికే ఈ త్రీసమ్ రొమాంటిక్ సాంగ్ యువతలో విపరీతంగా వైరల్ అవుతోంది. ప్రెజెంటేషన్‌లో ఉన్న క్లాస్ టచ్, సంగీతంలో ఉన్న మోడర్న్ బీట్‌లు ప్రేక్షకులను ఆకర్షిస్తున్నాయి. అయితే అనసూయ భరద్వాజ్ ఇలాంటి సాంగ్‌లో నటించడం కొంతమందిని ఆశ్చర్యపరిచింది.



## తారక్ లో మార్పు సినిమా కోసమేనా?



గతకొన్ని రోజులుగా టాలీవుడ్ స్టార్ హీరో ఎన్టీఆర్ అభిమానులు సోషల్ మీడియాలో చర్చల్లో మునిగిపోయారు. దానికి ప్రధాన కారణం ఆయన కొత్త లుక్! ఇటీవల తారక్ హాజరైన కొన్ని ఈవెంట్లలో ఆయన లుక్స్ వైరల్ అయ్యాయి. అందులో ఆయన చాలా సన్నగా కనిపించారు. దీనిని చూసి ఫ్యాన్స్ ఆశ్చర్యపోతూనే కొంత ఆందోళన కూడా వ్యక్తం చేశారు. చాలామంది సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఎందుకు తారక్ ఇంత లీన్‌గా కనిపిస్తున్నారు. ఈ మార్పు సినిమా కోసమేనా అంటూ కామెంట్లు చేస్తున్నారు.ప్రస్తుతం తారక్ ప్రశాంత్‌నీల్‌తో ఓ సినిమా చేస్తున్నారు. ఈ సినిమా కోసం లుక్ మార్చుకుంటున్నారు. ఇందులో తారక్ లుక్‌పై ప్రశాంత్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. తాజాగా అదిరే అప్డేట్ ఇచ్చారు. తారక్ లుక్‌ను దగ్గరుండి డిజైన్ చేయించుకుంటున్నారు.ఎన్టీఆర్ ఈ సినిమాలో మునుపెన్నడూ చూడని కొత్త పాత్రలో కనిపించనున్నారని సమాచారం. అతని స్టైలింగ్, బాడీ ట్రాన్స్‌ఫార్మేషన్ ఈ సినిమాకే పరిమితమని టీమ్ చెబుతోంది. అభిమానులు కూడా ఇప్పుడు ఈ కొత్త లుక్ వెనక దాగి ఉన్న సర్‌ప్రైజ్ ఏమిటో తెలుసుకోవాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com